జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 5 సంచిక 252 | హైదరాబాద్, జులై 02 శనివారం 2022 | 8 పేజీలు | వెల : 5.00

# యశ్వంత్ సిన్హా కేసీఆర్ కలిస్తే జరిగేదిదేనా?

## ఆ ఇంటిమీద కాకి ఈ ఇంటిమీద వాలేదిలేదట!

హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో విపక్షాల ఉమ్మడి రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా రాక కాంగ్రెస్ పార్టీలో కొత్త పంచాయితీకి తెరతీసింది. రాష్ట్రపతి ఎన్నికల్లో విపక్ష పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా బరిలోకి దిగిన యశ్వంత్ సిన్హా జూలై 2వ తేదీన హైదరాబాద్ నగరానికి రానున్నారు. ఈ క్రమంలో తెలంగాణ సీఎం కేసీఆర్ యశ్వంత్ సిన్హా రాకను స్వాగతిస్తూ భారీ ర్యాలీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. యశ్వంత్ సిన్హాకు తెలంగాణ సీఎం కేసీఆర్ మద్దతు ప్రకటించిన నేపధ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**కేసీఆర్ ను కలిస్తే యశ్వంత్ సిన్హాను తాము కలిసేది లేదు: రేవంత్ రెడ్డి**




యశ్వంత్ సిన్హా విషయంలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. యశ్వంత్ సిన్హా టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో భేటీ అయితే కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు ఆయనను కలవబోరని టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి తేల్చి చెబుతున్నారు. ముందు కేసీఆర్ ను కలిసినా, లేదా తమను కలిసిన తర్వాత టిఆర్ఎస్ వాళ్ళని కలవాలని చూసినా ఒప్పుకునేది లేదని తెలంగాణ పిసిసి తేల్చి చెబుతోంది.

**ఇద్దరూ ముఖ్యమే...**

యశ్వంత్ సిన్హాకు ఇబ్బందికర పరిణామం యశ్వంత్ సిన్హా కు టిఆర్ఎస్ పార్టీ మద్దతు ఇచ్చిన నేపథ్యంలో హైదరాబాదుకు వచ్చి టిఆర్ఎస్ అధినేతను కలవకుండా యశ్వంత్ సిన్హా వెళ్లలేరు. ఆయనకు టీఆర్ఎస్ ఓట్లు కావాలి. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ బాస్ ఆయనను కలిస్తే ఒప్పుకోబోమని చెప్తున్నారు. కాంగ్రెస్ నేతలను కలవకుండా వెళ్తే ఇది కూడా యశ్వంత్ సిన్హాకు ఇబ్బందికర పరిణామమే . అయితే తెలంగాణా కాంగ్రెస్ నేతలు కేసీఆర్ ను , తమను యశ్వంత్ సిన్హా కలిస్తే (మిగతా 2లో..)

# ఘనంగా నవయుగ అంబేద్కరుడు జెబి.రాజు 83వ జన్మదిన వేడుకలు...




హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ):ప్రముఖ సామాజిక ఉద్యమనేత, అద్వితీయ అంబేద్కర్ వాది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అవార్డీ డా.జేబీ రాజు (ఐఎఎస్ రిటైర్డ్ )83వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్నేహా సంస్థల చైర్మన్ డా.కె. శివభాగ్యారావు బహుజనతో పాటు ఈ కార్యక్రమంలో రెండు రాష్ట్రాల నుండి పలువురు ప్రముఖులు, అంబేద్కరీయులు, జెబి రాజు అభిమానులు భారీ సంఖ్యలో హాజరై బహుజన నాయకులు డా.జేబీ రాజుని పుష్పగుచ్చాలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జేబీ రాజుగారు మాట్లాడుతూ...తన అభిమానులను అంబేద్కరీయులకు కృతజ్ఞతలు తెలిపారు. తన శేష జీవితాన్ని మొత్తం బహుజన సంక్షేమానికి అంకితం చేస్తానని అన్నారు. డా. బీఆర్. అంబేద్కర్ చూపిన దారిలో నడుస్తుండటం సంతోషంగా ఉందన్నారు. తన పుట్టిన రోజు వేడుకలను నిర్వహించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

**స్నేహ సంస్థల చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు ఐఆర్ఎస్, వీఆర్ఎస్ మాట్లాడుతూ...**
38 సంవత్సరాల నవ యువకుడు డా.జేబీ రాజు అని ఎక్కడ బహుజన వాదం ఉన్నా దానికి పునాదిగా జెబి రాజు ఉంటాడని, నేటికీ ప్రతీ సమావేశం లో ఆయన ఉండి తీరాల్సిందే అని అన్నారు. (మిగతా 2లో..)

# జేపీ నడ్డాకు ఘన స్వాగతం



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా హైదరాబాద్ కు వచ్చారు. హైదరాబాద్ లో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో పాల్గొనేందుకు శుక్రవారం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. ఆయనకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, ఇతర నేతలు గ్రాండ్ వెల్ కమ్ చెప్పారు. భారీగా నేతలు, కార్యకర్తలు తరలిరావడంతో ఎయిర్ పోర్టు కిక్కిరిసిపోయింది. ఎయిర్ పోర్టు నుంచి శంషాబాద్ టౌన్ లో కిలోమీటర్ మేర రోడ్డు షో కొనసాగింది. రోడ్డుకిరువైపులా నేతలు, కార్యకర్తలు నిలబడి నడ్డాకు ఘన స్వాగతం పలికారు. జై బీజేపీ, నడ్డా జిందాబాద్ నినాదాలతో హోరెత్తింది. రోడ్ షో తర్వాత HICCలో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను లాంచ్ చేశారు. ఎగ్జిబిషన్ లో తెలంగాణ విమోచన చరిత్ర, నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, కుమ్రంభీం, షోయాబుల్లాఖాన్ లాంటి యోధుల చరిత్ర తెలిపేలా ప్రదర్శన ఉంది. మలి దశ ఉద్యమం, బీజేపీ పాత్రను తెలిసేలా ఫోటో ప్రదర్శన ఉండనుంది. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.రాత్రి 7 గంటలకు అక్కడే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులతో సమావేశమవుతారు. జాతీయ కార్యవర్గ సమావేశాల్లో చర్చించనున్న రాజకీయ, ఆర్థిక అంశాలపై నడ్డా వీరితో చర్చించనున్నారు. రాత్రి 8.30 గంటలకు భరతనాట్యం, శివతాండవం, పేరణి నృత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆ తర్వాత దరువు ఎల్లన్న నేతృత్వంలోని తెలంగాణ కల్చరల్ ప్రోగ్రామ్స్ ఉంటాయి. శనివారం ఉదయం 10 గంటలకు పార్టీ నేషనల్ ఆఫీసు బేరర్ల సమావేశం నడ్డా అధ్యక్షతన జరుగనుంది.


## జెబి రాజుకు జీవిత కాల సాఫల్య పురస్కార కార్యక్రమానికి మంత్రి కొప్పుల ఈశ్వర్ ను ఆహ్వానించిన స్నేహ సంస్థల చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు....



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ):ప్రముఖ అంబేద్కరిస్టు, సమాజ సేవకుడు జెబి రాజుకు జులై 31 న స్థానిక నాంపల్లి లోని తెలుగు యూనివర్సిటీ ప్రాంగణం లోని ఎన్ టి ఆర్ ఆడిటోరియం లో జరగనుండగా ఈ కార్యక్రమానికి రావాలని తెలంగాణ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను వారి నివాసమునకు వెళ్లి స్నేహ సంస్థల చైర్మన్ కటికల శివ భాగ్యారావు, ఆహ్వానించారు దానికి వారు సానుకూలంగా స్పందించి తప్పకుండా వస్తానని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో కటికల శివ భాగ్య రావు గారితో పాటుగా కుసుమ భోగరాజు, బొజ్జ బిక్షమయ్య పాల్గొన్నారు.

# వెల్‌కమ్ టు తెలంగాణ..

**బీజేపీ లీడర్లను ఆహ్వానిస్తున్న ప్రభుత్వ పథకాల బోర్డులు!**




హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణకు వచ్చే వారిని వెల్‌కమ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక హోర్డింగులు, గ్లో సైన్ బోర్డులు ఏర్పాటు చేసింది. ఎనిమిదేండ్ల నుంచి తెలంగాణ ఎలా పురోగమిస్తున్నది.. వివిధ రంగాల్లో ఎలా దూసుకెళ్తోంది అనే అంశాలతో వీటిని రూపొందించారు. హైదరాబాద్? సిటీలోని పలు ముఖ్య ప్రాంతాల్లో ఇంగ్లిష్‌లో ఏర్పాటు చేసిన హోర్డింగులు ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన బీజేపీ నాయకులకు తెలంగాణ సాధిస్తున్న ప్రగతి మీద అవగాహన కలగడానికి వీలుగా వీటిని రూపొందించినట్లు తెలుస్తోంది. అయితే.. వీటిని చూసి బీజేపీ నాయకులు అవాక్కవుతున్నారు.ఎటు చూసినా తెలంగాణ ప్రగతిని చాటి చెప్పే ఈ హోర్డింగులు తమ జాతీయ నాయకత్వం, ఇతర రాష్ట్రాల నాయకులు చూస్తే తెలంగాణ బీజేపీ పరువు గంగలో కలుస్తుంది అని వారు అనుకుంటున్నట్లు సమాచారం. నిజానికి తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఏవీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు కావడం లేదు. అభివృద్ధి సూచీల్లో కూడా తెలంగాణ కన్నా బీజేపీ రాష్ట్రాలు బాగా వెనుకబడి ఉన్నాయి. ఈ హోర్డింగుల ద్వారా బీజేపీ అగ్ర నాయకత్వానికి రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం షాక్ ఇచ్చినట్టే చెప్పాలి.

# ఆవో దేఖో సీకో మోదీజీ..

## మోదీకి కేటీఆర్ లేఖ



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: ప్రధాని నరేంద్ర మోడీకి మంత్రి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ఆవో దేఖో సీకో అంటూ ప్రధానికి లేఖ రాశారు. జాతీయ కార్యవర్గ సమావేశాల్లో విద్వేష విభజన ఎజెండా కాకుండా అభివృద్ధి వికాసం గురించి మాట్లాడాలని సూచించారు. పార్టీ డి.ఎన్.ఏ లోనే విద్వేషాన్ని, సంకుచిత్వం నింపుకున్న మోడీ ప్రజలకు పనికొచ్చే విషయాలను ఈ సమావేశాల్లో చర్చిస్తారని అనుకోవడం అత్యాశే అవుతుందంటూ ఎద్దేవా చేశారు. అబద్దాల పునాదులపై పాలన సాగిస్తున్న మోడీ ఆత్మవిమర్శ చేసుకునే ధైర్యం ఉందని అనుకోవడం లేదని మంత్రి కేటీఆర్ లేఖలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రాజెక్టులు, -పథకాలు, -సుపరిపాలన విధానాలు ప్రాధాన్యతలను అధ్యయనం చేయాలని లేఖలో సూచించారు. డబుల్ ఇంజిన్?తో ప్రజలకు ట్రబుల్ గా మారిన రాష్ట్రాల్లో అమలుచేసేందుకు ప్రయత్నించాలన్నారు.



## రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మందా జగన్నాథం నియామకం

హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మాజీ ఎంపీ మందా జగన్నాథం ను నియమిస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేబినేట్ మంత్రి హోదా కల్గిన ఈ పదవిలో మందా జగన్నాథం రెండేళ్లపాటు కొనసాగనున్నారు.

# మానవ రహిత యుద్ధ విమానానికి ప్రయోగం సక్సెస్



ఢిల్లీ, ప్రజాపాలన ప్రతినిధి: భారత రక్షణ రంగంలో మరో ముందడుగు పడింది. ఆయుధాలు తయారు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీవో) మరో అద్భుత ప్రయోగం చేపట్టింది. మనుషులు లేకుండానే ఓ విమానాన్ని తయారు చేసింది. ఈ మానవ రహిత యుద్ధ విమానాన్ని పరీక్షించింది. అత్యంత వేగంగా దూసుకపోయిన ఈ విమానం.. సేఫ్ గా ల్యాండ్ కావడంతో DRDA శాస్త్రవేత్తల్లో ఆనందోత్సాహాలు నింపింది. కర్నాటకలోని చిత్ర దుర్గ ఏరోనాటికల్ లో పరీక్ష నిర్వహించారు. అభివృద్ధిలో ఘన విజయం అని పరీక్ష సక్సెస్ అనంతరం డీఆర్డీవో వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రయోగంపై రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ స్పందించారు. అపూర్వమైన ఘనత సాధించారంటూ ప్రశంసించారు. డీఆర్డీవో..ఎన్నో ప్రయోగాలు చేపడుతున్న సంగతి తెలిసిందే. రక్షణ రంగానికి సంబంధించి కీలక ప్రయోగాలు చేసింది. అందులో భాగంగా మానవ రహిత యుద్ధ విమానాన్ని తయారు చేసింది. బెంగళూరులోని ప్రధాన పరిశోధన ల్యాబరేటరీ ఏరోనాటికల్ డెవలప్ మెంట్ ఎస్టాబ్లిష్ మెంట్ (ఏడీఈ) రూపొందించింది. ఈ విమానం కోసం పలు వ్యవస్థలను దేశీయంగానే అభివృద్ధి చేయడం విశేషం. మానవ రహిత విమానాల అభివృద్ధికి కీలకమైన సాంకేతికతను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని డీఆర్డీవో (DRDO) విశ్వాసం వ్యక్తం చేస్తోంది. ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ నుంచి ప్రయోగించారు. అత్యంత స్పీడుగా ప్రయాణించి.. సేఫ్ గా ల్యాండ్ అయ్యింది. ఆత్మనిర్భర్ భారత్ కు మార్గదర్శనం చేశారని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తెలిపారు. ఈ మేరకు ట్వీట్ చేశారు.



# కేసీఆర్ ప్రభుత్వం నాలుగు కోట్ల మంది ప్రజల గుదిబండగా మారింది

## కాశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి, ప్రస్తుత ఎంపీ కవిందర్ గుప్తా



బెల్లంపల్లి జూలై 1 ప్రజా పాలన ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ప్రజల బ్రతుకులు బాగుపడతాయని, తెలంగాణ ప్రజలు ఆశించితే, కేసీఆర్ ముఖ్యమంత్రి అయినాక, కుటుంబ పాలనతో నాలుగు కోట్ల మంది ప్రజానీకాన్ని మోసం చేసి గద్దెనెక్కి తెలంగాణ ప్రజల మీద పాలన చేస్తూ గుడిబండగా మారిందని కాశ్మీర్ మాజీ ఉపముఖ్యమంత్రి, ప్రస్తుత పార్లమెంటు సభ్యులు, కవీందర్ గుప్తా విమర్శించారు. శుక్రవారం స్థానిక శిశు మందిర్ పాఠశాలలో పట్టణ బిజెపి అధ్యక్షులు కోడి రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు, తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే తెలంగాణ ప్రజల బ్రతుకులు బాగుపడతాయని, ప్రజలు ఆశిస్తే కెసిఆర్ కుటుంబం నాలుగు కోట్ల మంది ప్రజానీకాన్ని మోసం చేసి గద్దెనెక్కి, తెలంగాణ ప్రజల మీద గుదిబండగా మారిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల్ని మోసం చేసస్తూ అబద్ధపు మాటలతోటి అబద్ధపు వాగ్దానాలతోటి పబ్బం గడుపుతున్న, టీఆర్ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయ పార్టీ బిజెపేనని, మూడవ తారీఖున నరేంద్ర మోడీ బహిరంగ సభతో తెలంగాణ ప్రజానీకానికి భారతీయ జనతా పార్టీ భరోసా ఇవ్వబోతుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుందని, నరేంద్ర మోడీ పథకాలు ఏవైతే ఉన్నాయో ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తుందని , టీఆర్ఎస్ కుటుంబ అవినీతి పాలనను తెలంగాణ ప్రజలు కచ్చితంగా బొందపెట్టి భారతీయ జనతా పార్టీకి పట్టం కడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూపాలపల్లి మాజీ అధ్యక్షులు వెన్నంపల్లి పాపన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమంద రమేష్ . కొయ్యల ఏమాజీ . రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బుల్లెడ్ల కేశవరెడ్డి . జిల్లా ఉపాధ్యక్షులు పులుగం తిరుపతి . జిల్లా కార్యదర్శి కోయల్కర్ గోవర్ధన్. రేవెల్లి రాజలింగు . రాజులాల్ యాదవ్. మరియు పట్టణ పదాధికారులు వివిధ మోర్చాల పదాధికారులు బూతు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




వీధి వీధిన.. ఇంటింటా నీలి రంగు జెండాల రెపరెపలు... ప్రతీ బహుజనుడి గుండె చప్పుడై నిలుస్తున్న పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆశయాలు....

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి: డివైఎఫ్ఐ రౌండ్ టేబుల్ సమావేశం



ఆసిఫాబాద్ జిల్లా జూలై01(ప్రజాపాలన, ప్రతినిధి) : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కై కార్పొరేట్, ప్రైవేట్, స్కూల్లో అధిక ఫీజుల దోపిడీ నియంత్రణ కై కృషిచేయాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక టిఏజిఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బోర్కుటే శ్యామ్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ మాట్లాడుతూ కార్పోరేట్ ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, పాఠ్యపుస్తకాలు, దుస్తుల, పేరుతో అడ్డూ అదుపు లేకుండా దోపిడే దేయం గా డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. కానీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. విద్యా హక్కు చట్టం కింద ప్రతి సంవత్సరం కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బిసి, పిల్లలకు ఉచిత విద్య అందించాలని, జిల్లా వ్యాప్తంగా ఎంత మంది విద్యార్థులకు అందిస్తున్నారని, విద్యాశాఖ అధికారులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే కార్పొరేట్ స్కూల్లో దోపిడి నియంత్రణ కై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేనియెడల ఉమ్మడి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు టికానంద్, ఏఐఆర్ఎస్ఓ, డిబివిఎస్, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా నవయుగ అంబేద్కరుడు జెబిరాజు 83వ జన్మదిన వేడుకలు...



(మొదటి పేజీ తరువాయి)

రెండు తెలుగు రాష్ట్రాలలో బహుజన వాదానికి జెబి రాజు పెద్ద దిక్కు అని,ఆయన పుట్టినరోజు వేడుకలను నిర్వహిస్తున్న ప్రతీ సంఘానికి శివ భాగ్యారావు జైభీములతో ధన్యవాదాలు తెలిపారు.జేబీ రాజు జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.జేబీ రాజు అభిమానులు ఆయన భావజాలాన్ని భుజానికెత్తుకునే వారు ముందుకు రావాలన్నారు.కార్యక్రమంలో పలువురు ప్రముఖులు,బహుజన సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## డాక్టర్ జెబి రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అంబేద్కర్ కోనసీమ జిల్లా కు చెందిన హైదరాబాద్ వాసులు...



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ): ప్రముఖ అంబేద్కరిస్టు డాక్టర్ జెబి రాజు గారి వ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు అంబేద్కర్ కోనసీమ జిల్లా కు చెందిన హైదరాబాద్ వాసులు. ఈ సందర్భంగా సాలార్ జంగ్ కాలనీ లోని జెబి రాజు ఇంటికి డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ కోనసీమ జిల్లాకు చెంది హైదరాబాద్ లో స్థిర నివాసం ఏర్పరచుకున్న తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ జొన్నల మాధవరావు జెబి రాజు పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా జెబి రాజు రాజు మాట్లాడుతూ నా మీద ఎంతో అభిమానంతో ఉదయాన్నే మా ఇంటికి వచ్చిన వారందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాడాసి కురువ/మాదాసి కురువ ఎస్ సి వెల్ఫేర్ సభ్యులు మహేష్ కూడా పాల్గొన్నారు.

## యశ్వంత్ సిన్హా కేసీఆర్ కలిస్తే జరిగేదిదేనా?

(మొదటి పేజీ తరువాయి)

తప్పుడు సంకేతాలు వెళ్తాయని చెబుతున్నారు. ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటి మీద వాలేది లేదన్న రేవంత్ రెడ్డి ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటి మీద వాలేది లేదని తాము ముందే చెప్పామని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. యశ్వంత్ సిన్హా కాంగ్రెస్ అభ్యర్థి కాదని, తృణమూల్ కాంగ్రెస్ అధినేత మమతా బెనర్జీ మద్దతు అడిగితే తాము ఇచ్చామని రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మొత్తం మీద విపక్ష పార్టీల ఉమ్మడి అభ్యర్థి యశ్వంత్ సిన్హా కు హైదరాబాద్ రాక పెద్ద తలనొప్పిగా తయారైంది. ఒకపక్క బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల సమయంలో హైదరాబాద్ కు రావటం ఒక టాస్క్ అయితే ఇక్కడ కాంగ్రెస్, టీఆర్ఎస్ లను కలవటం ఆయనకు కత్తిమీద సామే. కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీల మధ్య నలిగిపోతున్న రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా కరవమంటే కప్పకు కోపం విడవమంటే పాముకు కోపం అన్న చందంగా కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీల మధ్య రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా పరిస్థితి ఉంది. ఒక పక్క టిఆర్ఎస్ భారీ ర్యాలీ నిర్వహించి యశ్వంత్ సిన్హా ను స్వాగతించాలని ప్రయత్నిస్తుంటే, మరోపక్క అల్టిమేటం జారీ చేసిన కాంగ్రెస్ పార్టీ తీరు, యశ్వంత్ సిన్హా రాకపై ఆసక్తికి కారణంగా మారింది.

## స్నేహ కార్యాలయంలో డాక్టర్స్ డే వేడుకలు...

### అంబేద్కర్ ఛానల్ డైరెక్టర్ డా.ఎన్ వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించిన డాక్టర్ కటికల శివభాగ్యరావు



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి): వైద్యో నారాయణో హరి అన్నారు పెద్దలు అంటే వైద్యుడు దేవుడితో సమానం అన్నది అసలు అర్థం. శుక్రవారం డాక్టర్స్ డే సెలబ్రేషన్స్ లో భాగంగా స్నేహా టీవి కార్యాలయంలో అంబేద్కర్ ఛానల్ డైరెక్టర్ డా.ఎన్ వెంకటేశ్వరరావుకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేటి వైద్యులు వారు పని చేస్తున్న తీరును కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రముఖులు కొనియాడారు.అంబేద్కర్ టీవి,స్నేహా గ్రూప్ ఆఫ్ ఆర్గనైజేషన్ చైర్మన్ డా.కె.శివభాగ్యారావుబహుజన మాట్లాడుతూ డా.ఎన్ వెంకటేశ్వరరావు వైద్యుడిగా, అంబేద్కరిస్ట్ గా వారి సేవలు అమోఘమని అన్నారు.తన వైద్య వృత్తిలో ఏ ఒక్క రోజు కూడా సెలవులు తీసుకోకుండా పనిచేశారని గుర్తుచేశారు. డా.అంబేద్కర్ ని ఆదర్శంగా తీసుకుని వారి భావజాలాన్ని విస్తృతంగా వ్యాప్తిచేస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ,కెన్నీబాబు,ఇనుగాల భీమారావు,కేబి రాజు డాక్టర్ ఓగూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొని డా.ఎన్ వెంకటేశ్వరరావుని ఘనంగా సన్మానించారు.

## అనిరెడ్డి రామరక్షా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం క్యాంపు




ఇబ్రహీంపట్నం జూలై తేది 1ప్రజాపాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని మంచాల్ రోడ్డులో గల అనిరెడ్డి రామరక్షా హాస్పిటల్లో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ సిహెజ్ ప్రభాకర్ మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని,పేద ప్రజల కోసమే తాము ఎల్లప్పుడూ సేవ చేస్తామనిన్నారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో భాగంగా 285 మందికి ఉచితంగా చికిత్సను అందించి, వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు.అందరికీ పూర్తిగా ఉచితంగా మందులు పంపిణి చేశామన్నారు.డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ యజమాని డాక్టర్ అనిరెడ్డి సుజన్ రెడ్డి డాక్టర్లు లౌక్య అశ్విన్ కుమార్,పరీక్షిత్,రాజేష్ సురేష్ రెడ్డి,వైద్య సిబ్బంది గణేష్,ఉదయ్ నర్సులు పాల్గొన్నారు.

## వికలాంగులకు ఉచిత బస్సు పాసుల క్యాంపు నిర్వహించారు



ఇబ్రహీంపట్నం జూలై తేదీ 1 ప్రజాపాలన ప్రతినిధి :వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్ పి ఆర్ డి అధ్వర్యంలో మంచాల్ మండలం మంచాల్ గ్రామంలో వికలాంగులకు ఉచిత బస్సు పాసుల క్యాంపు జిల్లా ప్రదాన కార్యదర్శి జేర్కోని రాజు ఎర్పాటు చేశారు ఈ క్యాంపు జిల్లా నాయకులు అశ్వాల బాల్ రాజ్ అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమంలో దీల్ సుఖ్ నగర్ డిపో జి.యస్ రెడ్డి సార్ మంచాల్ మండల నాయకులు బుచి రెడ్డి పాపి రెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


## ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్ పూర్తిగా నిషేధం: ఐటీడీఏ పిఓ వరుణ్ రెడ్డి



ఆసిఫాబాద్ జిల్లా జూలై 01(ప్రజాపాలన,ప్రతినిది) : జిల్లాలో ఒకేసారి వాడి పడేసే ప్లాస్టిక్ శుక్రవారం నుండి పూర్తిస్థాయిలో నిషేధించాలని ఐటీడీఏ పీవో వరుణ్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాత్ పాయి, జిల్లా అటవీ శాఖ అధికారి దినేష్ కుమార్ తో కలిసి, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వల్ల పర్యావరణం కలుషితమవుతుందని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జూలై 01నుండి 120 మైక్రాన్ కంటే తక్కువ ఉన్న అన్ని రకాల ప్లాస్టిక్ బ్యాన్ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా వ్యాపారులు వాటిని వాడితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఐటీడీఏ పరిధిలో జరుగుతున్న పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి సురేందర్, పంచాయతీ అధికారి రమేష్, ఈవో వంశీకృష్ణ, అన్ని రకాల అసోసియేషన్ల సభ్యులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మండలాధికారులతో వీడియో కాన్ఫరెన్స్



ఆసిఫాబాద్ జిల్లా జూలై 01(ప్రజాపాలన, ప్రతినిధి) : వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మండల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయం నుండి జిల్లాలోని అన్ని మండలాల తాసిల్దార్, ఎంపీడీవో లతో, అదనపు కలెక్టర్ రాజేశం, జిల్లా రెవెన్యూ అధికారి సురేష్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ప్రత్యేక శ్రద్ధ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాలలో ఎక్కడ నీరు నిలువకుండా ఉండేలా చూడాలన్నారు. అలాగే ధరణి లో ఏర్పడే సమస్యలు తీర్చి రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. మీసేవా కేంద్రాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు పూర్తిగా నిషేధించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, అన్ని మండలాల ఎమ్మార్వోలు ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## డాక్టర్స్ డే సందర్భంగా మొక్కను నాటిన డాక్టర్ సంజయ్



కోరుట్ల, జూలై 01 ( ప్రజాపాలన ప్రతినిధి): కోరుట్ల పట్టణం లోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్స్ డే సందర్భంగా యశోద హాస్పిటల్ ప్రముఖ వైద్యులు, టీఅర్ఎస్ యువ నాయకులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మొక్కలు నాటారు.

## సీఎంఆర్ బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలి



మంచిర్యాల టౌన్, జూలై 01, ప్రజాపాలన : లిసీఎంఆర్ బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపువేరకు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు శుక్రవారం రోజున ధర్నా, అనంతరం కలెక్టర్ కార్యాలయ ఎ ఒ కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్బంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కష్టం మిల్లింగ్ రైస్ ను 2022 జూన్ 7వ తేదీ నుండి నిలుపుదల చేశారు. ఫలితంగా రాష్ట్రంలో 1500 రైస్ మిల్లులు మూత పడ్డాయి. దాంతో సుమారు రెండు లక్షల మంది హమాలీ కార్మికులతో పాటు మిల్లు డ్రైవర్లు, దినసారి కూలీలు, గుమస్తాలు, ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లు, ఇతర రైస్ మిల్లు ఆధారిత కార్మికులు పనులు కోల్పోయారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు పనులు కోల్పోయి సొంత రాష్ట్ర లకు తిరిగి వెళ్లారు. ఈ సమస్యలకు పరిష్కారం వెతకాల్సింది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలే ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే ఎఫ్సీఐ ద్వారా సీఎంఆర్ బియ్యాన్ని కోనుగోలు చేసి పేదలకు ఉచితంగా బియ్యం సరఫరా చేస్తూ రైస్ మిల్లు ఆధారత కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.లేనియెడల పలు ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారా బయల్డ్ రైస్ మిల్ హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఇంగు రామచందర్, సభ్యులు రాజయ్య, జయరాజ్, లక్ష్మణ్, మల్లేష్, నరేష్, పోచయ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఇబ్రహీంపట్నం జులై తేదీ 1ప్రజాపాలన ప్రతినిధి :రంగారెడ్డి జిల్లా మంచాల మండలం మండల్ నాయకులు టిఆర్ఎస్వి ప్రధాన కార్యదర్శి ఆవుల ప్రశాంత్ యాదవ్ మాట్లాడుతూప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు స్టేషనరీ పేర్ల మీద చేసే వ్యాపారం అరికట్టాలని కార్పొరేట్ విద్య సంస్థల యజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి లక్షల రూపాయలు వస్తువులకి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు పాఠశాల ఫీజులు నోటీసు బోర్డులో తప్పనిసరి చూపించాలిని కోరారు విద్యారంగ సమస్యలను వెంటనే పరిశీలించాలి అని కోరారు.

## జాతీయ వైద్యుల దినోత్సవం

### మున్సిపల్ చైర్పర్సన్ డా.భోగ శ్రావణిప్రవీణ్ లకు ఘన సన్మానం




జగిత్యాల, జులై 01 (ప్రజాపాలన ప్రతినిధి): జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భముగా మున్సిపల్ ఛైర్పర్సన్ డా.భోగ శ్రావణిప్రవీణ్ లకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపి, ఘనంగా సన్మానించిన వారు తెలంగాణ రాష్ట్ర పీఎంపీ అధ్యక్షులు డా.జి రాజుగోపాల చారి మరియు హరిఅశోక్ కుమార్.

## బొగ్గు గని కార్మికులవేజ్ బోర్డు చర్చలు విఫలం

### సమ్మె నోటీసు ఇవ్వాలని నిర్ణయించిన నాలుగు జాతీయ కార్మిక సంఘాలు



బెల్లంపల్లి జూలై 1 ప్రజా పాలన ప్రతినిధి: హైదరాబాదులోని మెరీడియన్ లో శుక్రవారం జరిగిన బొగ్గు గని కార్మికుల 11వ వేతన కమిటీ చర్చలు విఫలమయ్యాయని వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు., కోల్ ఇండియాలోని డబ్ల్యూ సి ఎల్, సి సి ఎల్, ఎస్ సి సి ఎల్, కంపెనీలు నష్టాలతో ఉన్నాయని, భూగర్భ గనులన్నీ కూడా నష్టాలతో ఉన్నాయని కావున కార్మికుల వేతనాలు ఎక్కువ పెంచలేమని యాజమాన్యం చెప్పినట్లుగా తెలిపారు. పదవ వేజ్ బోర్డు కంటే ఎక్కువగా 27% కంటే ఎక్కువ పెంచాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేయగా, వేజ్ బోర్డు చైర్మన్ అగర్వాల్ అంత వేతనాలు పెంచలేమని చెప్పడంతో కార్మిక సంఘాలు నాయకులు చర్చలు బహిష్కరించి బయటకు వచ్చి నోటీసు ఇచ్చి బొగ్గు గనుల శాఖామంత్రిని, కాల్ మినిస్ట్రీ కార్యదర్శిని కలిసిన అనంతరం సమ్మె నోటీసు ఇవ్వాలని మరియు సింగరేణిలో ఆందోళన కార్యక్రమాలు చేయాలని నిర్ణయించినట్లుగా వారు తెలిపారు.

## జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా పలువురు వైద్యులను సన్మానించిన జనగాం జిల్లా కలెక్టర్





హైదరాబాద్ 1 జులై ప్రజాపాలన:జనగాం జిల్లా కలెక్టర్ సి.హెచ్.శివలింగయ్య ఐఎఎస్. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన పలువురు డాక్టర్ లను జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.జనగాం జిల్లా దేవరుప్పుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ కిషోర్ తాల్క ను ఉత్తమ సేవలు అందించినందుకు అవార్డు తో ఘనంగా సత్కరించారు.పాలకుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ ప్రియాంక తాల్క ను ఉత్తమ సేవలు అందించినందుకు జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు డాక్టర్ లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్న పిల్లల ఆరోగ్య గ్రోత్ మానిటరింగ్ కార్డుల పంపిణీ





మల్లాపూర్ జులై 01 ( ప్రజాపాలన ప్రతినిధి): మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామంలోని అంగన్వాడీ పాఠశాలలో శుక్రవారం ఐదేండ్లలోపు పిల్లల పై ప్రత్యేకంగా దృష్టి సారించి నిత్యం వారి ఎదుగుదల,ఆరోగ్యం,ఎత్తు, బరువును ప్రామాణికంగా తీసుకొని వారి ఆరోగ్యస్థాయిని నిర్ధారించే గ్రోత్‌మానిటరింగ్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సాయికుమార్, సీడీపీవో తిరుమల దేవి, ఐసిడిఎస్ డి శైని, కలిసి కార్డులు పంపిచేశారు. సీడీపీవో మాట్లాడుతూ 0-5 ఏండ్ల వయస్సున్న ప్రతి ఒక్కరి ఆరోగ్యస్థితిగతుల పర్యవేక్షిస్తూ మండలం లోని అన్ని అంగన్‌వాడీకేంద్రాల్లో ప్రతినెలా 1వ తేదీన పిల్లల బరువు, ఎత్తు, జబ్బచుట్టు కొలతను పరీక్షించి.. వయస్సుకు తగినట్టుగా ఉన్నదీ, లేనిది కార్డులో నమోదుచేస్తారు. ఇలా రికార్డు చేసే సమయంలో ఎంపిక చేసిన రంగులను వినియోగిస్తారు. ఆకుపచ్చ రంగు సాధారణ స్థాయిని, పసుపు రంగు తక్కువ పోషక లోపాన్ని, ఎరుపు రంగు పోషకలోపాన్ని సూచిస్తాయి. అతితక్కువ బరువు, అతి తీవ్ర పోషక లోపం (ఎస్ఏఎం), తక్కువ తీవ్ర పోషక (ఎంఏఎం), అతి తక్కువ ఎత్తు లేదా బరువు పొడవు గుర్తించిన పిల్లలు మెడికల్ ఆఫీసర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా వైద్యులచే పరీక్షించి మందులు ఇస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ విజయ సంకల్పసభను విజయవంతం చేయండి: ప్రవేశ్ సింగ్




మేడిపల్లి, జూలై 1 (ప్రజాపాలన ప్రతినిధి): ఈ నెల 3వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో జరిగే బీజేపీ విజయు సంకల్ప సభను విజయువంతం చేయాలని బీజేపీ ఇండస్ట్రియల్ సెల్ జాయింట్ కన్వీనర్ ప్రవేశ్ సింగ్ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు హైదరాబాదులో జరగడం శుభ పరిణామమని, వచ్చే ఎన్నికలలో తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని పర్వేసింగ్ పేర్కొన్నారు. హైదరాబాద్ కు వివిధ రాష్ట్రాల నుంచి బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశాలకు హాజరౌతున్న నాయకులతో పార్టీలో కదనోత్సాహం కనిపిస్తోందన్నారు. ఈ నెల 3వ తేదీన జరిగే విజయ సంకల్ప సభకు వచ్చే పార్టీ నాయకులు, కార్యకర్తలకు స్వాగతం పలికే బాధ్యత పార్టీ ప్రవేశ్ సింగ్ కు అప్పగించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ బిజెపిలో నూతనోత్సాహం నిండుతోందని, వచ్చే ఎన్నికలలో విజయానికి ఇది నాంది అని అన్నారు. మీడియాతో మాట్లాడిన వారిలో ప్రవేశ్ సింగ్ తో పాటు, రంగారెడ్డి జిల్లా కిసాన్మోర్చా వైస్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి, రంగారెడ్డి జిల్లా బొంగు రవి గౌడ్, ఓరుగంటిశ్రీనివాస్ గౌడ్, గుండ్ల అశోక్ బోధన్ అశ్విన్ కుమార్, తోట వెంకటనారాయణ, రవి ఆనంద్, నరసింహారెడ్డి వున్నారు. కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్ మాట్లాడుతూ మోడీ సభను సక్సెస్ చేయాలని కోరారు.

## టి ఏమ్ పి ఈ ఎ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు



మంచిర్యాల టౌన్, జూలై 01, ప్రజాపాలన : టి ఏమ్ పి ఈ ఎ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్ డే వేడుకలను శుక్రవారం రోజున మంచిర్యాల జిల్లాకేంద్రంలో డా.,బీదాన్ చంద్ర రాయ్ జయంతి సందర్భంగా నిర్వహించే నేషనల్ డాక్టర్స్ డే ని తెలంగాణ మెడికల్ ప్రైవేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలోని పలువురు డాక్టర్స్ ని సన్మానించారు రాష్ట్ర అధ్యక్షులు తీగల శ్రీనివాస్ రావు మాట్లాడుతూ వైద్యో నారాయణ హరి అన్నారు, దేవుడు జన్మణిస్తే వైద్యులు సాధ్యమైనంతవరకు పునర్జన్మ నిస్తారు , తల్లి దండ్రులు గురువుల తర్వాత వైద్యులే కీలకం అన్నారు, కరోన సమయంలో రక్త సంబంధికులు ప్రాణాలకు బయపడి దూరంగా ఉన్న సమయంలో ప్రాణాలను త్యాగం చేసి అన్ని విధాలుగా వైద్యం చేసి లక్షలాది మంది ప్రాణాలను కాపాడారు డాక్టర్స్ అని అన్నారు. ఈ సంధర్భంగా డా.సుబ్బారాయుడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, డా.రమణ తన స్టేట్ ప్రెసిడెంట్, డా.నీలకంటేశ్వర్ , డా. జోగేందర్, డా.భాస్కర్, డా విజయ, డా.ప్రవీణ్ కుమార్, డా. సింధూజ లను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సొల్లు శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాస్ కోశాధికారి రాము తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేశాయి

### రైతు సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మందడపు రాణి



మధిర,జులై 1 ప్రజాపాలన ప్రతినిధి: రాజకీయ లబ్దికోసం తెలంగాణ రైతులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేశాయని జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మందడపు రాణి అన్నారు. శుక్రవారం నుంచి హుజూర్ నగర్ లో 1 2 3 తేదీల్లో జరిగే తెలంగాణ రైతు సంఘం మహాసభలకు మధిర మండలం నుంచి ఆ సంఘం నాయకులు ఆధ్వర్యంలో మహిళలు రైతులు పెద్ద సంఖ్యలో బయల్దేరి వెళ్లారు. ముందుగా మండల పరిధి మల్లవరం గ్రామంలో ఉన్న మాజీ ఖమ్మం జిల్లా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమరజీవి కామ్రేడ్ మందడపు నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మందడపు రాణి మాట్లాడుతూ రాష్ట్రంలో రబీ సీజన్‌లో రైతులు 52 లక్షల ఎకరాల్లో సాగు చేశారని, ఇప్పుడు కేవలం 35 లక్షల వరకు మాత్రమే సాగు చేస్తున్నారన్నారు.ప్రత్యామ్నాయ పంట లేకుండా చేశారని ఆమె మండిపడ్డారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపైఒకరు విమర్శలు చేసుకుంటూ రైతులను మోసం చేశారని రాణి ఆరోపించారు. కేసీఆర్ చేత కానీ తనం తోనే రైతులు నష్టపోయారన్న రాణి ఎరువుల ధరలు ప్రతి ఏడాది పెరుగుతున్నాయన్నారు.మూడేళ్ల క్రితం రైతులకు ఉచిత ఎరువులు ఇస్తామని, రుణమాఫీ చేస్తామని రైతులను మభ్యపెట్టారని,4 సంవత్సరాలైనా మాఫీ కాలేదన్నారు.ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై రైతు సంఘం ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.హుజూర్నగర్ లో జరిగే పార్టీలకతీతంగా రైతులు పాల్గొని ఆ సభను విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బెజవాడ రవిబాబు,సిపిఐ మండల కార్యదర్శి వుట్ల కొండలరావు,చెరుకూరి వెంకటేశ్వర్లు,మచ్చ వెంకటేశ్వర్లు,సుజాత,గరిడేపల్లి వెంకటేశ్వర్లు,మచ్చ పద్మ, మహిళా రైతులు మహిళా కార్యకర్తలు, నాయకులు తదితరులు ఉన్నారు.

"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?
ప్రశ్న మాది - లక్ష మీది

నేటికీ సమాజంలో గౌతమ బుద్ధ , జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్, బీ పీ మండల్ , షేక్ ఫాతిమా, సురవరం ప్రతాపరెడ్డి , త్రిపురనేని రామస్వామి చౌదరి , రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగువారు అంటే ఎవరో అని తెలియని వాళ్ళు ఉన్నారు. ఈ మధ్య కాలంలో కొందరు రాజకీయ నాయకులు బహుజన మహనీయుల చిత్రపటాలను చూసి ఎవరు వీళ్ళు అని ప్రశ్నించిన సందర్భాలు నెలకొన్నాయి.

మన బహుజన సామాజిక స్ఫూర్తిదాతల చరిత్ర, ఉద్యమ స్ఫూర్తి మరుగున పడిపోవడంవల్ల భావితరాలకు స్ఫూర్తి మరియు దేశాభివృద్ధిలో పురోగతి ఉండదు. అందువల్ల అన్ని కులాలలోని మహానుభావుల చరిత్రను ప్రపంచానికి తెలియచెప్పాలనే ఉద్దేశంతో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో మాస్టర్ కీ టీవీ (అంబేద్కర్ టీవీ) ఛానల్ లో

"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?"
ప్రశ్న మాది - లక్ష మీది

అనే ఒక సరికొత్త ప్రోగ్రాం ను ప్రారంభించబోతున్నాం.

ఈ కార్యక్రమానికి నాంది పలుకుతూ స్పాన్సర్ చేసిన వారి వివరములు :

| | |
|---|---|
| 12.పర్లపల్లి చారిటబుల్ ట్రస్ట్ | Rs 5000/- |
| 13.ఓగూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, | Rs 5000/- |
| 14.కుసుమ కమల రత్నం మెమోరియల్ ట్రస్ట్ | Rs 2000/- |
| 15. రత్నశ్రీ పార్స్ ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ | Rs 2000/- |

స్పాన్సర్ చేసిన వారికి ధన్యవాదములు

ఈ ప్రోగ్రాంకు స్పాన్సర్ చేయదలిచిన వారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించగలరు

మా అకౌంట్ వివరాలు :

Cell No. 9154958315

మీరు Sponsorship amount ను Jai B Bhoomi News Channel Limited - A/c. No: 38072051879 , IFSC : SBIN0005893, State Bank of India,Bazarghat Branch,Hyderabad
అకౌంట్ కు పంపించిన కౌంటర్ ఫైల్ తో పాటు మీ వివరాలు పోస్ట్ ద్వారా లేక masterkeytv234@gmail.com ఈ మెయిల్ కు పంపించగలరు.

ప్రజాపాలన

సంపాదకీయం

శనివారం 02, జులై 2022

## కార్మిక వలసలు ఉభయతారకం

పంజాబ్ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్ని తన తప్పును సరిదిద్దుకున్నారు. బిహారీ వలస కార్మికుల గురించి ఆయన చేసిన అవహేళనాత్మక వ్యాఖ్యలను పంజాబ్ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో చన్ని తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు. అమెరికా ప్రభుత్వం హెచ్ 1 బి వీసాల సంఖ్యను తగ్గించేందుకు సంల్పించినప్పుడు కూడా ఇలాగే జరిగింది. అమెరికన్ల ఒత్తిడి మూలంగా వాషింగ్టన్ పాలకులు ఆ సంకల్పాన్ని విరమించుకున్నారు. బాగా అభివృద్ధి చెందిన దేశాలన్నీ నిపుణ వలస కార్మికులకు సాదర స్వాగతం పలుకుతున్నాయి.నైపుణ్యం లేని కార్మికుల వలసలు కూడా ఆతిథేయి ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన మేలు చేస్తాయి. అభివృద్ధి చెందిన దేశాలకు ప్రత్యేక నైపుణ్యాలు లేని కార్మికుల వలసల వల్ల ఆ సంపన్న దేశాల ప్రజలు అధునాతన నైపుణ్యాలు అవసరమైన కార్యకలాపాలలో నిమగ్నం కాగలుగుతున్నారు. ఉదాహరణకు బిహార్ నుంచి పంజాబ్‌కు వలస వచ్చిన అనిపుణ కార్మికులు ట్రాక్టర్ డ్రైవర్లుగా, పంటకోత, నూర్పిడి, ఇతర కాయకష్టం పనులు చేస్తున్నారు. దీనివల్ల నవీన నైపుణ్యాలు గల పంజాబ్ రైతులు మార్కెట్లో ఆయా పంటల ధరలు మొదలైన అంశాలపై తమ దృష్టిని కేంద్రీకరించగలుగుతున్నారు. నవీన వ్యవసాయ నైపుణ్యాలు అంతగా లేని కార్మికుల వలసల వల్ల పంజాబ్ రైతులు మరో ప్రయోజనం పొందుతున్నారు. మరింత భూ విస్తీర్ణంలో విస్తృతంగా వివిధ పంటలు సాగు చేయగలుగుతున్నారు. సాగుభూమి విస్తీర్ణం పెరగడంతో దిగుబడులూ పెరిగి రైతులు లబ్ధి పొందుతున్నారు. వలసవచ్చిన శ్రామికులు, రైతుల కంటే ఎక్కువగా పొలాలు దున్నడం, నాట్లు వేయడం, కోతలు, నూర్పిడి పనులు చేయగలుగుతారు. మరో ప్రయోజనమేమిటంటే ఆతిథేయి రాష్ట్రంలో వ్యవసాయ కూలీ రేట్లు తగ్గిపోతాయి.కార్మిక వలసలు వారిని సరఫరా చేసే రాష్ట్రం లేదా దేశానికి కూడా పలు ప్రయోజనాలను సమకూర్చుతాయి. నిరుద్యోగం తగ్గిపోతుంది. బిహార్‌లో నేడు వ్యవసాయ కార్మికుని దినసరి వేతనం రూ. 400గా ఉంది. రాష్ట్రానికి చెందిన వ్యవసాయకూలీలు అత్యధిక సంఖ్యలో పంజాబ్ మొదలైన రాష్ట్రాలకు వలస వెళ్ళడం వల్ల కార్మికుల లభ్యత తగ్గిపోయింది. తత్ఫలితంగా బిహార్‌లో ఉన్నవారికి కూలీ రేట్లు పెరిగాయి. మరి కార్మికులు వలసపోకపోతే వారు పెద్ద సంఖ్యలో రాష్ట్రంలోనే అందుబాటులో ఉండగలుగుతారు. అప్పుడు వారి కూలీరేట్లు అనివార్యంగా రూ. 400 నుంచి రూ. 300కి తగ్గిపోతాయి. వలస కార్మికులు స్వదేశం లేదా స్వరాష్ట్రంలోని తమ కుటుంబ సభ్యులను ఆదుకోవడానికి పెద్ద మొత్తాల్లో లేదా ఎంతో కొంత డబ్బును పంపడం పరిపాటి. ఉదాహరణకు కేరళ ఆర్థిక వ్యవస్థ చాలవరకు ఇలాగే గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కార్మికుల నుంచి అందుతున్న డబ్బుపైన ఆధారపడి ఉంది. కార్మికుల వలసలు ఆతిథేయి రాష్ట్రం/ దేశానికే కాకుండా వారిని సరఫరా చేస్తున్న రాష్ట్రాలు, దేశాలకు కూడా ఇతోధిక లబ్ధిని సమకూరుస్తున్నాయి. ఈ కారణం వల్లే చన్ని తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవడం అనివార్యమయింది. మహారాష్ట్ర ప్రజలు మహారాష్ట్ర నవ నిర్మాణ్ సమితి నాయకుడు రాజ్ థాకరేను ఆదరించకపోవడానికి కూడా వలస వచ్చిన వారి పట్ల ఆయన వ్యతిరేకతే కారణమని స్పష్టంగా చెప్పక తప్పదు.వలస కార్మికులతో ఆతిథేయి దేశ ప్రాథమిక సదుపాయాలపై అనివార్యంగా అదనపు భారం పడుతుంది. దీనివల్ల ఆతిథేయి రాష్ట్రాల ప్రభుత్వాలపై ఆర్థిక భారం పెరుగుతుంది. అయితే ఆయా సదుపాయాల మెరుగుదల, అభివృద్ధికి అయ్యే వ్యయం, వలస కార్మికుల వల్ల సమకూరుతున్న లబ్ధితో పోల్చినప్పుడు చాలా తక్కువేనని చెప్పవచ్చు. పంజాబ్ ఆర్థిక వ్యవస్థే ఇందుకొక నిదర్శనం. ఒక వైపరీత్యం ఏమిటంటే ఇతోధిక లబ్ధి సమకూరుస్తున్నప్పటికీ స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం వలస కార్మికుల పట్ల వ్యతిరేకతను రెచ్చగొట్టడం జరుగుతోంది. భావోద్వేగాలను రెచ్చగొట్టడం ద్వారా రాజకీయవేత్తలు స్వార్థ ప్రయోజనాలు సాధించుకోవడానికి ప్రయత్నించవచ్చుగానీ అది ఆతిథేయి రాష్ట్రాల ప్రజల శ్రేయస్సుకు ఎంతమాత్రం దోహదం చేయదు.సాధారణ కార్మికుల విషయం అటుంచి విద్యాధికుల వలసలు తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. బిహార్‌కు చెందిన అనేక మంది ఐఏఎస్ అధికారులు ఢిల్లీలో గృహాలు నిర్మించుకుని, శాశ్వతంగా ఢిల్లీలో స్థిరపడుతున్నారు. దీనివల్ల వారి సేవలు స్వరాష్ట్రానికి కొరవడుతున్నాయి. బిహార్ అభివృద్ధికి నష్టం జరుగుతోంది. అదే విధంగా ఇంజనీరింగ్ పట్టభద్రులు మన దేశం నుంచి అమెరికాకు వలసపోవడం పరిపాటిగా ఉంది. ఈ వలసల వల్ల మనం అనేక విధాలుగా చాలా నష్టపోతున్నాం. మరి ఈ మేధో వలసలను అరికట్టడం ఎలా? కార్మికులను సరఫరా చేసే రాష్ట్రాలలో పాలనా పరిస్థితులు సక్రమంగా లేకపోవడం వల్లే ఈ వలసలు అనివార్యమవుతున్నాయి. బిహార్‌కు చెందిన ఒక వ్యాపారి సూరత్‌కు వలసపోయి అక్కడ ఒక జౌళి ఫ్యాక్టరీని నెలకొల్పుతాడు. కార్మికులు కూడా బిహార్ నుంచి సూరత్‌కు వలసపోయి ఆ వ్యాపారి ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీలో పని చేస్తుంటారు. అలా ఫ్యాక్టరీ యజమాని, కార్మికులు ఇరువురూ బిహార్‌కు చెందినవారు. మరి ఇదే కృషిని వారు బిహార్‌లో ఎందుకు చేయలేకపోయారు? సూరత్‌కు ఎందుకు రావలసివచ్చింది? బిహార్‌లో పరిపాలన సక్రమంగా లేకపోవడం వల్లనే అని చెప్పక తప్పదు. అక్కడి బ్యూరాక్రసీ వ్యాపారవేత్తలకు అనుకూలంగా వ్యవహరించి రాష్ట్రానికి మేలు చేయడానికి బదులు, వారి నుంచి స్వార్థానికి డబ్బు గుంజుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యమివ్వడం పరిపాటి. తత్కారణంగానే బిహారీల వలసలు. పరిష్కారమేమిటి? కార్మికులను సరఫరా చేసే రాష్ట్రాలలో పరిపాలనా పరిస్థితులను మెరుగుపరచడమే. వ్యాపారవేత్తలు, నిపుణ కార్మికులు స్వరాష్ట్రంలోనే ఉండేలా పాలనా వ్యవస్థలను తీర్చిదిద్ది సుపరిపాలనను అందించాలి. అప్పుడే కార్మికులు, పారిశ్రామికవేత్తలు రాష్ట్రాభివృద్ధికి దోహదం చేయగలుగుతారు. తమ పాలన అధ్వాన్నంగా ఉన్నప్పుడు వలసలను వ్యతిరేకించడం వల్ల కార్మికులను సరఫరా చేసే రాష్ట్రాలకు ఎటువంటి ప్రయోజనం సమకూరదు. రాష్ట్రాభివృద్ధికి దోహదం జరగదు. ఈ వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని వలసలను మనం స్వాగతించాలి. పాలనా పరిస్థితులను విధిగా మెరుగుపరచాలి. అప్పుడు మాత్రమే ఆర్థికాభివృద్ధి, ప్రజాసంక్షేమం సుసాధ్యమవుతాయి.

# వెలిసిపోతున్న వారసత్వ వైభవాలు




'ఎవరు ముఖ్యమంత్రి అయినా, ఆ మహాశయుడిని నిర్దేశించే రిమోట్ కంట్రోల్ ఎల్లప్పుడూ నాతోనే ఉంటుంది' ఈ విలక్షణ నిర్మొహమాట మాటలు ఎవరు అన్నారో మరి చెప్పాలా?! బాల్ ఠాక్రే. ఏ సందర్భంలో అన్నారో కూడా చెప్పనివ్వండి. 2004 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన సమయాన విలేఖర్లు ఆ పెద్ద మనిషిని ఒక ప్రశ్న వేశారు : బీజేపీ–శివసేన కూటమి గెలిచిన పక్షంలో సంభావ్య ముఖ్యమంత్రిగా మీ కుమారుడు ఉద్ధవ్ ఠాక్రేను పరిగణనలోకి తీసుకుంటారా? ఈ ప్రశ్నకే ఆయన అలా నిక్కచ్చిగా సమాధానమిచ్చారు. ఇరవై సంవత్సరాలు కూడా గడవక ముందే ఠాక్రే అభిజాత్యం పట్ల చరిత్ర నిర్దయగా వ్యవహరించింది. ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం పతనమయింది. శివసేనలో అంతర్గత తిరుగుబాటు వల్లే అది జరిగింది. అంతేనా? 'రిమోట్ కంట్రోల్' సైతం మాతోశ్రీ (ఠాక్రేల గృహం) నుంచి వెళ్లి పోయింది. అర్ధ శతాబ్ది క్రితం మహారాష్ట్ర అస్మిత (ఆత్మ గౌరవం) ఉద్ధరణకు 'భూమి పుత్రుల' ఉద్యమంగా ప్రారంభమైన శివసేన ఇప్పుడు అస్తిత్వ సంక్షోభంలో ఉంది! శివసైనికులకు తమ పార్టీ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మాత్రమే కనిపిస్తోంది. ముంబైలో నడుస్తున్న చరిత్ర శివసేనకు మహా ఇబ్బందికరమైన పరిస్థితే, సందేహం లేదు. ఈ దురవస్థ ఎందుకు ప్రాప్తించింది? మహా శక్తిమంతుడైన ఒక వ్యక్తిపై ఆధారపడిన కుటుంబ –కేంద్రిత ప్రాంతీయ పార్టీలు ఏదో ఒక దశలో అస్తిత్వ సంక్షోభాన్ని తప్పక ఎదుర్కొంటాయి. శివసేన ఇప్పుడు అటువంటి అస్తిత్వ ప్రమాదాన్నే పాక్షికంగా చవిచూస్తోంది. పార్టీ వ్యవస్థాపకుడు క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలిగిన తరువాత పార్టీ ఆధిపత్యం నిరాటంకంగా కొనసాగేలా అతడి వారసులు దీక్షా దక్షతలతో వ్యవహరిస్తున్నారా? లేదు. ఉత్తరప్రదేశ్‌లో ఒక అఖిలేశ్ యాదవ్, బిహార్‌లో ఒక తేజస్వి యాదవ్, పంజాబ్‌లో ఒక సుఖ్‌బీర్ బాదల్, కర్ణాటకలో ఒక హెచ్‌డి కుమారస్వామి… ఇంతెందుకు, కాంగ్రెస్ పార్టీ ప్రథమ కుటుంబ గాంధీలకు వంశపారంపర్య విశేషాధికారాలు క్రమంగా తగ్గిపోతున్నాయి. వారసత్వంగా పార్టీపై పెత్తనం దక్కినా అధికార ప్రాభవం లభించడం లేదు. ఆదర్శప్రాయమైన వారసత్వ రాజకీయాలకు ఉదాహరణగా తరచు మన్నన పొందుతున్న బిజూ జనతాదళ్ అధినేత, ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సైతం ఆ క్రమక్షీణతకు మినహాయింపుగా లేరు. నవీన్ బాబు తరువాత ఎవరు? అనే ప్రశ్న బిజూ జనతాదళ్ భవిష్యత్తులో ఎదుర్కోనున్న సవాల్‌ను ప్రతిబింబిస్తోంది. ఒక్క డిఎంకె మాత్రమే, అధినేత ముత్తువేల్ కరుణానిధి మరణానంతరం తమిళనాట రాజకీయాలలో తన ప్రాబల్యాన్ని తిరుగులేని రీతిలో నిలబెట్టుకోగలిగింది. కారణమేమిటి? కార్యకర్తలకు పార్టీ పట్ల చెక్కుచెదరని అంకిత భావమే అని చెప్పి తీరాలి. శివసేన సైతం కార్యకర్తల ఆధారిత పార్టీయే అనడంలో మరో అభిప్రాయం లేదు. పార్టీ శాఖల్లో కార్యకర్తల అభిప్రాయానికే ప్రథమ పరిగణన. ఇదొక ప్రత్యేకమైన వ్యవస్థ.

అన్ని శాఖలను సమైక్యంగా ఉంచడంలో బాల్ ఠాక్రే వ్యక్తిత్వం, నాయకత్వ దక్షత కీలక పాత్ర వహించేది. రాజకీయ వ్యంగ్య చిత్రకారుడుగా జీవితాన్ని ప్రారంభించి రాజకీయవేత్తగా పరిణమించిన బాల్ ఠాక్రే అద్వితీయ నాయకుడు. సాటిలేని మేటి. ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టడంలో మహానేర్పరి. ఎన్నికలలో ఒక్కసారి కూడా పోటీ చేయని బాల్ ఠాక్రే తన పార్టీకి తిరుగులేని నాయకుడు. ఆయన మాటే తుది నిర్ణయం. సీనియర్ నాయకులు, అట్టడుగు కార్యకర్తలు ఒకే విధేయతతో వ్యవహరించేవారు. భయ భక్తులతో మెలిగేవారు. ప్రాంతీయ, జాతీయ ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహిస్తూనే బాల్ ఠాక్రే మహాశయుడు బహిరంగంగా 'థోక్షాహి' (హింసాత్మక బెదిరింపుల) రాజకీయాలను ఆమోదించారు, ప్రోత్సహించారు. బాల్ ఠాక్రే జన సమ్మోహన శక్తి అసాధారణమైనది. కుమారుడు ఉద్ధవ్ తన తండ్రికి నకలుగా వ్యవహరించేందుకు ఎన్నడూ ప్రయత్నించలేదు. ఇది అభినందించదగ్గ విషయమే. అయితే ఒక ఉదారవాదిగా తనకు ఒక సొంత గుర్తింపును తెచ్చుకునేందుకు రాజకీయవేత్తగానే కాదు, శివసేన నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాధినేతగా కూడా ఉద్ధవ్ ప్రయత్నించారు. పులి తన చారలను మార్చుకోలేదన్న సత్యాన్ని ఆయన విస్మరించారు. శివసైనికుల 'కీర్తి' ఏమిటి? దశాబ్దాలుగా ముంబై వీధి పోరాటకారులుగా వారు పేరు పొందారు. ఆ శ్రేణుల్లో భ్రష్ట కార్మికుల సంఖ్య తక్కువేమీ కాదు. క్రికెట్ పిచ్‌లు తవ్వివేయడం, పాకిస్థానీ కళాకారుల కార్యక్రమాలను అడ్డుకోవడం, ప్రత్యర్థుల దక్షిణ భారతీయులు కానివ్వండి లేదా ముస్లింలు కానివ్వండి పై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడడం శివసైనికుల 'పేరు ప్రతిష్ఠ'ల చిట్టాలో ప్రముఖంగా ఉన్నాయి. ఐదు దశాబ్దాల కాలంలో శివసైనికుల 'శత్రువు' పలుమార్లు మారాడు కానీ పార్టీ రణ ప్రియ వ్యవహార శైలి పదునెక్కిందేగాని ఇసుమంత కూడా మారలేదు. శివసేనలో ప్రస్తుత అసాధారణ తిరుగుబాటునకు నాయకత్వం వహించిన ఏక్‌నాథ్ షిండే కూడా పులు కడిగిన ముత్యమేమీ కాదు. ఆయనకు మార్గదర్శి అయిన ఆనంద్ ధిఘే ఒక రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి థానేలోని ఒక ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మరణించాడు. ఆ ఆసుపత్రిపై దాడికి పాల్పడిన మూకకు నాయకత్వం వహించిన ఘనత ఈ షిండే మహాశయుడికి ఉంది. మృదువుగా మాట్లాడే ఉద్ధవ్, జెస్యూట్ కళాశాలలో విద్యాభ్యాసం చేసిన ఆయన కుమారుడు ఆదిత్య శివసేన రాజకీయాల నాగరీక పార్శ్వానికి ప్రతినిధులే అయినప్పటికీ పార్టీ 'పూర్వ ప్రతిష్ఠలు' తొలగిపోతాయా? వీధి పోరాటకారుల వైఖరి అంత త్వరగా మారిపోతుందా? మారదు కనుకనే ఉద్ధవ్ వ్యవహార శైలి, నిర్ణయాలపై పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్న సణుగుడు, గొణుగుడు తక్కువేమీ కాదు. హనుమాన్ చాలిసా చదువుతానని పట్టుపట్టిన మహారాష్ట్ర ఎంపీ ఒకరిపై శివసేన ప్రభుత్వం దేశద్రోహ నేరారోపణ మోపింది. ఇది శివసైనికులను విభ్రాంతపరిచింది. చాలా మంది గాభరా పడ్డారు. పార్టీ నాయకత్వ వైఖరిలో 'లౌకికవాద' మార్పుతో రాజీపడలేకపోయారు. అనేక మంది గాభరా పడ్డారు. ఠాక్రే కుటుంబంలోని తిరుగుబాటుదారు రాజ్ ఠాక్రే శివసైనికుల అయోమయ పరిస్థితిని తన రాజకీయ లబ్ధికి చక్కగా వినియోగించుకున్నారు. పర్యావరణ సమస్యల పరిష్కారం పట్ల ఆదిత్య ఠాక్రే నిబద్ధత కొనియాడదగిందే, సందేహం లేదు. అయితే శివసైనికులకు తమ యువనేత తీరుతెన్నులు అర్థం కావడం లేదు. అస్తిత్వ రాజకీయాల భావోద్వేగ అంశాలకు కాకుండా వాతావరణ మార్పుకు ఆదిత్య ఎందుకు ప్రాధాన్యమిస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. శివసేనలో ఇదొక అంతర్గత అలజడి. అది కేవలం సైద్ధాంతిక, తరాల మధ్య పోరు మాత్రమే కాదు. దీనికి తోడు మహారాష్ట్రలో శివసేన రాజకీయ పలుకుబడిని స్వాయత్తం చేసుకునేందుకు బీజేపీ ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించింది. జాతీయ పాలక పక్షం ఇందుకు పూనుకోకపోతే శివసేనలో చీలిక సంభవించేది కాదు. ఇదొక వాస్తవం. ఈ విషయాన్ని మరింత నిశితంగా చూద్దాం. శివసేన, బీజేపీలు 1988లో తొలిసారి సన్నిహితమయ్యాయి. కలసికట్టుగా రాజకీయ ప్రస్థానం చేసేందుకు నిర్ణయించుకున్నాయి. భాగస్వామ్య సూత్రాలు స్పష్టమే. మహారాష్ట్రలో శివసేనకు ప్రాధాన్యం, జాతీయ రాజకీయాలలో బీజేపీ మార్గమే శిరోధార్యం. ప్రభవిస్తోన్న హిందుత్వ జాతీయవాద రాజకీయాలే సమరశీల 'మరాఠీ మనూస్' పార్టీ, హిందీ భాషా ప్రాంతాల ప్రధాన రాజకీయ శక్తి బీజేపీ మధ్య బంధాన్ని పటిష్ఠం చేశాయి. ఈ పరస్పర ప్రయోజనకర బంధమే మహారాష్ట్రలో మరాఠాల ప్రాబల్యమున్న కాంగ్రెస్ గుత్తాధిపత్యానికి సవాల్‌గా పరిణమించింది. మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని ఆధిపత్యానికి ఇది మొట్ట మొదటి సవాల్. బీజేపీ, శివసేనలు పరస్పరం దగ్గరవడమనేది ఒక 'ఆచరణాత్మక అవసరం' అని ఆ రాజకీయ సంకీర్ణ నిర్మాత దివంగత ప్రమోద్ మహాజన్ ఒకసారి వ్యాఖ్యానించారు. ఒక కూటమిగా ఏర్పడేంతవరకు శివసేన, బీజేపీలకు మహారాష్ట్రలో 1 శాతం చొప్పున ఓట్లు మాత్రమే లభించేవి. ఇరు పార్టీలూ కలిసి మహారాష్ట్రలో 1995లో తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఈ రాజకీయ సమస్కంధుల మధ్య మిత్ర బంధం క్రమేణా సుదృఢమయింది. 2014 సార్వత్రక ఎన్నికలలో బీజేపీ ఘన విజయం సాధించింది. దీంతో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేసేందుకు సాహసించింది. నాటి బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా వ్యూహరచన ఫలించింది. మహారాష్ట్ర అసెంబ్లీలో ఏకైక పెద్ద పక్షంగా బీజేపీ ఆవిర్భవించింది. పార్టీ నాయకుడు దేవేంద్ర ఫడణవీస్ ముఖ్యమంత్రి అయ్యారు. ఎన్నికల అనంతరం శివసేన మళ్లీ బీజేపీ పక్షాన చేరింది. ప్రభుత్వంలోనూ భాగస్వామి అయింది. అయితే గాయపడ్డ పులిలా ఉండిపోయింది. 2019లో బీజేపీతో శివసేన తెగతెంపులు చేసుకుంది. ఎన్నికల అనంతరం ఎన్‌సిపి, కాంగ్రెస్‌తో కలిసి 'మహారాష్ట్ర వికాస్ అఘాడీ' కూటమిగా ఏర్పడింది. 2014లో బీజేపీ వ్యవహరించిన తీరుపై ఇలా 'ప్రతీకారం' తీర్చుకుంది. 2019 వంచనకు ప్రతిఘటనే 2022 తిరుగుబాటు. శివసేన, బీజేపీ రాష్ట్ర నాయకుల మధ్య వైషమ్యాలు బాగా పెరిగిపోయాయి. ఎంతగా పెరిగిపోయాయంటే పగలు తీర్చుకునేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను నిస్సిగ్గుగా దుర్వినియోగం చేయడం జరుగుతోంది. ఉద్ధవ్ ఠాక్రే పక్షాన ఉన్నవారు ఈడీ నుంచి తీవ్ర సమస్యల నెదుర్కొంటున్నారు. తిరుగుబాటు వర్గంలో వారికి 'రక్షణ' తప్పక లభించగలదని మరి చెప్పనవసరం లేదు. సరే, ఉద్ధవ్ ఠాక్రే ఇప్పుడేమి చేయనున్నారు? మళ్లీ బీజేపీ పక్షాన చేరుతారా లేక మహారాష్ట్ర వికాస్ అఘాడీతోనే ఉంటారా? ఏ కూటమితోనూ సంబంధం లేకుండా ఒంటరిగా ఉండిపోతారా? కీలక ముంబై మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు రాబోతున్నాయి. తప్పటడుగు వేయడానికి వీలులేదు. మొత్తం మీద ఠాక్రే కుటుంబ రాజకీయ వారసత్వమేకాదు, మహారాష్ట్ర రాజకీయాలలో శివసేన మనుగడ కూడా ప్రమాదంలో పడిందనేది స్పష్టం.

# బీడు సెలకలు

గడ్డి పోగుల్ని ఒళ్ళు నిండా కప్పుకుని
వెచ్చగా నిద్రపోతాంది పొలం
రాళ్ళ సవ్వడి సంగీతానికి
ఉట్లగడ్డి తలూపతాంటే
గడ్డిపువ్వు పళ్ళికిలిత్తా నవ్వుతాండాది
రైతు వచ్చేది లేదు
మడక పట్టి దున్నేది లేదు
పిచ్చి మొక్కల యుద్ధ భేరికి
నేల బీటలువారి పోతాంటే
గాలి విసురు దుమారం పక్కుమంది
సంచుల్లో విత్తనాలు
ఊపిరాడక పుచ్చిపోతాంటే
చీడ పురుగు నాట్యమాడుతాంది
అరువు కరువు కాలనాగై
బుసలు కొడతా మీదికెగబడతాంటే
కర్షక బొందిలో పాణం
గుటకలు మింగుతా కూచుండాది
కొయ్యబొమ్మ లెక్కన నేటి పాలన
తెర చాటున తొంగిచూత్తాంటే
దిక్కుతోచని స్థితి మంచమెక్కినాది
మొహం కడగని బీడు సెలకలు
పాలిపోయినట్టు కనిపిత్తాంటే
సాలళ్ళ గొంతు ఎండిపోయిండాది
గుబురు గుట్టలన్నీ నిండుగా
పరక ఊసలు బాదం పీచుతో
ఉరకలేత్తా ఎగబడి పోతాంటే
బీడు సెలక గుండె బరువెక్కినాది
ముంగారు కాలం మీదికొచ్చినా
అదును చేయలేని సగటు బతుకు
ఆవులిస్తా ఓ మూలకు ఒరిగిపోతాంటే
కాలం పకపకా నవ్వేసినాది
వాన కార్తె మేఘాల్ని వెంటేసుకుని
సైనికాధికారిలా శంఖం పూరిస్తాంటే
డొల్ల జేబు రైతు బతుకు
భోరున విలపిత్తాండాది.



– నరెద్దుల రాజారెడ్డి,

# రైతులకు వ్యవసాయనికి విద్యుత్‌కు పెట్టిన కోతలు ఎత్తివేయాలి: మాదగోని జంగయ్యగౌడ్



ఇబ్రహీంపట్నం జూలై 1ప్రజాపాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం.లో వైయస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర నాయకుడు మాదగోని జంగయ్యగౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిరంతరం వ్యవసాయనికి 24గంటలు ఉచిత కరెంట్ సరఫరా చేస్తాం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం అని మాయ మాటలు చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ క్రమ క్రమంగా రైతులకు కరెంట్ కోతలు విధిస్తు 24గంటలు సరఫరా చేసే కరెంట్ ఏకంగా15గంటలు కోతలు పెడుతూ 9గంటలు మాత్రమే కరెంట్ సరఫరా చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మీడియాలో మాత్రం రైతులకు 24గంటలు ఉచిత కరెంట్ సరఫరా చేస్తున్నాం అని రాష్ట్ర మంత్రులు అధికారి పార్టీ నాయకులు చెప్పుకోవడం సిగ్గు చేటు అన్నారు 24గంటలు కరెంట్ ఉంటది కేసీఆర్ మాట తప్పడు అని రైతులు ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలు నమ్మి రైతులు వరి పంటలు పండించే పొలాలు పూర్తి స్థాయిలో సాగు చేసి వారి పంట వేసు కోవటానికి. సిద్ధం చేసుకున్నారు. సిద్ధంగా ఉన్న పొలాలకు కరెంట్ కోతలతో సాగు నీరు సక్రమంగా అందక పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు 24గంటలు కరెంట్ ఉంటది నమ్మి వరి పంటలు వేసుకోవడానికి పూర్తి స్థాయిలో సాగు చేసుకున్నాం ఏకంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం15గంటలు కరెంట్ కోతలు విధించటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో బిక్కు బిక్కుమంటున్నారు వేరే పంటలు సాగు చేసుకుందాం అంటే సమయానికి వర్షాలు కురవడం లేదు ఒక రైతు బంధు పథకంతో రైతులను నమ్మించి రైతులకు అందే అన్ని సబ్సిడీ పథకాలను దూరం చేసిన గొప్ప ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేస్తా అని ఇప్పట్టికి చేయక పాయే వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతులకు వ్యవసాయ నికి సరఫరా చేసే విద్యుత్ కు పెట్టిన కోతలు వెంటనే ఎత్తువేయాలి రైతులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం24గంటలు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం ఉచిత విద్యుత్ సరఫరా చేయాలి పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వని డిమాండ్ చేస్తున్నాం లేని పక్షంలో తెలంగాణ రాష్ట్రం లో చలో అసెంబ్లీ అంటూ మరో కరెంట్ ఉద్యమం జరుగుతుంది అని హెచ్చరిస్తున్నాం .

## ప్లాస్టిక్ నిషేధంపై రాయికల్ పట్టణంలో అవగాహన ర్యాలీ



రాయికల్, జూలై 01(ప్రజాపాలన ప్రతినిధి): భారత పర్యావరణ, వాతావరణ, అటవీశాఖలు దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల అమ్మకం, వినియోగంపై 'జూలై 2022' నుండి పూర్తి నిషేధం విధించబడిన సందర్భంగా ఈరోజు రాయికల్ పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించుటకు రాయికల్ పురపాలకసంఘంతమ సిబ్బందితోకలిసి మున్సిపల్ కార్యాలయం నుండి గాంధీవిగ్రహం చౌరస్తావరకు ప్లాస్టిక్ నిషేధముపైఅవగాహన ర్యాలీనిర్వహించి ప్రజలచే,సిబ్బందితో మున్సిపల్ చైర్మన్ మోర హనుమాన్లు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధమును పాటించడం అంటే వ్యక్తిగతబాధ్యత కాదని, సామాజికబాధ్యతఅని, ప్లాస్టిక్ రహిత స్వచ్ఛరాయికల్ గా తీర్చిదిద్దుటకు పట్టణ ప్రజలు,వ్యాపారస్తులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం చైర్మన్ మోర హనుమాన్లు,కమిషనర్ జి.సంతోష్ కుమార్,వైస్ చైర్మన్ జి.రమాదేవి పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు,మేనేజర్ వెంకటి,మెప్మాఆర్పీలు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు,తదితరులు పాల్గొన్నారు.

## ఒక లక్ష ఇరవై నాలుగు వేల ఐదువందల గుట్కాను పట్టివేత: టౌన్ ఎస్ఐ సతీష్ కుమార్



మధిర రూరల్ జూలై1 ప్రజా పాలన ప్రతినిధి :మండలం పరిధిలో శుక్రవారంం నాడు రాయపట్నం శివారులో కంచికచర్ల నుంచి వైరాకు కారులో తరలిస్తున్న 1,24,500 విలువగల గుట్కాను పట్టుకోవడం జరిగింది. వైరా కు చెందిన అయ్యప్ప అనే వ్యక్తి కంచికచర్ల లోని శేఖర్ అనే వ్యక్తి దగ్గరనుండి ఇట్టి గుట్కాలు కొనుగోలు చేసి వైరాకు తీసుకు వెళ్తుండగా మాకు అందిన సమాచారం మేరకు రాయపట్టణం వద్ద పట్టుకోని ఇట్టి వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగింది.

## లిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్ డే సెలెబ్రేషన్స్



ఇబ్రహీంపట్నం జులై తేదీ 1 ప్రజాపాలన ప్రతినిధి :ప్రజా ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న వైద్యులందరికీ డాక్టర్స్ డే శుభాకాంక్షలు అని లిమ్స్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ రాంరాజు , డాక్టర్ విశ్వనాథ్ డాక్టర్ దినేష్ అన్నారు.శుక్రవారం లిమ్స్ హాస్పిటల్ ఆవరణలో ఘనంగా డాక్టర్స్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు..ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజలందరికి మంచి వైద్యం అందిస్తూ అందరికి నిత్యం అందుబాటులో ఉంటూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామీణ ప్రాంతంలో ప్రజలు అందరికి మంచి వైద్యం అందిస్తున్న లిమ్స్ హాస్పిటల్ అని,ప్రజలందరికీ మరిన్ని వైద్య సౌకర్యాలు కల్పించే విధంగా హాస్పటల్లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని సందర్భంగా నిర్వాకలు తెలిపారు.వైద్యం అంటే ఓ వృత్తిగా కాకుండా మనుషుల్ని బ్రతికించే ఓ మహాశక్తిగా ప్రజలకు సేవ చేస్తున్న వైద్యులకు లిమ్స్ హాస్పిటల్లో జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు సందర్భంగా లిమ్స్ హాస్పిటలో కేక్ కట్ చేసి వైద్యుల అందరికి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లిమ్స్ హాస్పిటల్ డాక్టర్స్ ,నరేష్, ఆనంద్, తేజ,అబిలాష్,హాస్పిటల్ మేనేజర్ కాలే బాషా,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేట గ్రామములో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం



రాయికల్, జూలై 01(ప్రజా పాలన ప్రతినిధి):రాయికల్ మండలంలోని కొత్తపేట గ్రామములో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం లో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమములో సర్పంచ్ బి. రాజేశం ఉపసర్పంచ్ రాజశేఖర్ రెడ్డి మరియు ఆశా వర్కర్స్ పాల్గొని గ్రామములోని డ్రైనేజీలల్ల బ్లీచింగ్ పౌడర్ చల్లి రోడ్లకు ఇరు వైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు

## భువనగిరి లో వైద్యులను సన్మానించిన రోటరీ క్లబ్ అధ్యక్షులు



యాదాద్రి భువనగిరి జిల్లా 1 జులై ప్రజాపాలన: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా పలువురు వైద్యుల ను సన్మానించిన భువనగిరి రోటరీ క్లబ్ అధ్యక్షులు భువనగిరి రోటరీ క్లబ్ అధ్యక్షులు బండారు దత్తాత్రేయ ఆద్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు అందిస్తున్న పలువురు వైద్యులను శాలువా పూలమాల తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గడ్డం జ్ఞాన ప్రకాశ్ రెడ్డి రోటరీ క్లబ్ మెంబర్లు ప్రజాప్రతినిధులు నాయకులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాయికల్ టైలర్ యూనియన్ ర్యాలీ



రాయికల్, జులై 01 (ప్రజాపాలన ప్రతినిధి): రాయికల్ పట్టణ టైలర్ యూనియన్ ఆధ్వర్యంలో రాజస్థాన్ రాష్ట్రం ఉదయపూర్ లో టైలర్(దర్జీ)కన్నయ్య లాల్ ను ముష్కరులు అతికిరాతకంగా హత్య చేసినందుకు నిరసనగా పట్టణంలోర్యాలీ నిర్వహించిఅనంతరం తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు.

## పాలమూరులో గాడిదలు, గొర్రెల చోరీ...!

**పది రోజుల్లో 60 గొర్రెలు... 15 గాడిదలు మాయం**

**వెంటపడి పట్టుకున్న బాధితులు... ఆటో వదిలి పరారైన దుండగులు**



పాలేరు జూలై 1 ప్రజా పాలన ప్రతినిధి: ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మూగజీవాల పచ్చి మేత కోసం పాలమూరు జిల్లా కు చెందిన గొర్రెల పెంపకందారులు మందను తీసుకుని ఈ ప్రాంతం కు వస్తారు. ఇక్కడ వ్యవసాయ పనులు ప్రారంభించేంత వరకు జీవాలను మేపుకుంటారు. ఈ నేపథ్యంలో ఈ సీజన్లో నేలకొండపల్లి మండలం లోని నాచేపల్లి, రాయగూడెం. చెరువుమాధారం గ్రామ సమీపంలో పొలాల్లో మందలను ఉంచుతారు. వీరి వెంట బరువులను మోసేందుకు గాడిదలను తీసుకొస్తారు. ఇటీవల కాలంలో గాడిదలు, గొర్రెలు చోరీకి గురవుతున్నాయి. ఒక్క పది రోజుల్లోనే 60 గొర్రెలు, 15 గాడిదలు మాయమైయ్యాయి. పెంపకందారులు కంటికి కునుకు లేకుండా జాగారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం తెల్లవారు జామున దొంగల ముఠా రాయగూడెం వద్ద మంద నుంచి మూడు గాడిదలు, 2 గొర్రెలను ట్రాలీ ఆటో కు ఎక్కించారు. మేల్కొన్న మల్లేష్ అనే బాధితుడు లేచి చూడగా ఆటో'ను తరలిస్తున్నారు. కేకలు వేయటంతో మిగతా వారంతా మేల్కొన్నారు. లక్ష్మణ్ అనే వ్యక్తి బైక్ వేసుకుని ఆటో ను వెంబడించారు. ఈ క్రమంలో ఆటో తో బైక్‌ను డీకొట్టే పని చేశారు. అయినప్పటికీ వెంటపడి రాయగూడెం గ్రామంలో ఆటో కు అడ్డంగా బైక్ నిలపటంతో దుండుగలు చేసేది లేక ఆటో ను వదిలి పరారైయ్యారు. విషయం ను పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలం కు చేరుకుని గాడిదలను బాధితులకు అప్పగించి, ఆటో ను స్టేషన్ కు తరలించారు. పాలమూరు కు చెందిన హనుమంతరావు కుచెందిన 16 గొర్రెలు. 4 గాడిదలు, శివకోటి కి చెందిన 2 గాడిదలు, 3 గొర్రెలు,బీరప్పన్ కు చెందిన 3 గాడిదలు, 2 గొర్రెలు, బాలరాజు కు చెందిన 3గాడిదలు, 2 గొర్రెలు, చంద్రప్ప కు చెందిన 5 గాడిదలు, 2 గొర్రెలు,డి. కొండప్పకు చెందిన 3 గాడిదలు, జే.శ్రీను కు చెందిన 2 గాడిదలు. ఇలాపలువురు కు చెందిన దాదాపు 60 గొర్రెలు. 15 గాడిదలు చోరీ జరిగినట్లుబాధితులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

## ద్వితీయ రైతు మహాసభలకు వెళ్లిన నేలకొండపల్లి నాయకులు..



పాలేరు జూలై 1 ప్రజా పాలన ప్రతినిధి: ఖమ్మం జిల్లా నేలకొండపల్లి నుండి సూర్యపేట జిల్లా హుజూర్నగర్ లో జరుగుతున్న రైతు సంఘం ద్వితీయ మహాసభలకు భారీ ఎత్తున తరలి వెళ్లిన రైతులు!! తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ద్వితీయ మహాసభలకు హుజుర్ నగర్ కు నేలకొండపల్లి మండలం నుండి రైతులు భారీ ఎత్తున తరలి వెళ్లినారు. మహాసభలకు తరలి వెళ్లిన వారిలో నేలకొండపల్లి మండల సిపిఐ కార్యదర్శి కర్నాటి బానుప్రసాద్, మండల రైతు సంఘం కార్యదర్శి బాగం నరసింహారావు, అధ్యక్షుడు కనకబండి శీతరాములు, నేలకొండపల్లి సిపిఐ గ్రామ కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, రైతు నాయకులు నంబూరి నారాయణ,పాల్తియా శ్రీను, మండల నాయకులు మల్లేబోయిన ఉపేందర్, ఆలేటి మహేష్, భూక్యా వెంకటేశ్వరరావు,పాలపాటి అశోక్, గుగులోతు వెంకటేశ్వరరావు, సిర్రా ప్రసాద్,రాయల మాధవరావు,మాలోతు అయోధ్య,వల్లాల క్రిష్ణ తదితరులు భారీ ఎత్తున తరలి వెల్లినారు.

## తల్లాడ పంచాయతీలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు..

**పర్యవేక్షిస్తున్న సర్పంచ్ సంధ్యారాణి, ఈవో సీతారాములు..**



తల్లాడ, జులై 1 (ప్రజా పాలన న్యూస్): లితల్లాడ మేజర్ గ్రామపంచాయతీలో పారిశుధ్య పనులు వేగంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం పంచాయతీ పరిధిలోని నారాయణపురంలో ముమ్మరంగా పనులను చేపడుతున్నారు. గ్రామంలో ప్రోక్లైన్ ద్వారా సైడ్ కాలవలు, పూడికలు తీయిస్తున్నారు. అదేవిధంగా గ్రామంలో పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈ పనులను తల్లాడ మేజర్ పంచాయతీ సర్పంచ్ పొట్టేటి సంధ్యారాణి, పంచాయతీ ఈవో జీనుగు సీతారాములు పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల రోజులు నుండి పారిశుద్ధ్య కొరలను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందునా ఈ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలు సమస్యలను దృష్టిలో ఉంచుకొని వాటిని పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారి వెంట వార్డు మెంబరు గొడుగునూరి శ్రీనివాస రెడ్డి, పలువురు సిబ్బంది ఉన్నారు.లి


## రైతు మహాసభలకు తరలిన రైతులు



బోనకల్ ,జూలై 1 ప్రజా పాలన ప్రతినిధి: ఈనెల 1, 2, 3 తేదీలలో హుజూర్నగర్ లో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ద్వితీయ మహాసభలకు బోనకల్ మండలంలోని పలు గ్రామాల నుండి రైతులు తరలి వెళ్లారు. రైతులు వెళుతున్న వాహనాలను తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి జక్కుల రామారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం రైతాంగం సంక్షోభంలో ఉందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను గాలికి వదిలేసాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ప్రచార హార్భాటాలకే తప్ప రైతులకు ఏమాత్రం పనికి రాలేదన్నారు. ఈ బీమా పేరు చెప్పి వేలకోట్ల రూపాయలను రైతుల దగ్గర నుంచి ప్రీమియం కార్పొరేట్ సంస్థలకు మోడీ దోచి పెట్టారని ఆయన దిగబట్టారు. రైతుల రుణమాఫీ చేస్తానని 2018 ఎన్నికల్లో హామీ ఇచ్చిన కేసీఆర్ వాటిని తుంగలో తొక్కారన్నారు. కేవలం రైతుబంధు ఇస్తే రైతుల సమస్యలు తీరుతాయంటూ కెసిఆర్ ప్రగల్భాలు పలుకుతున్నారని, అంతకుముందు ప్రభుత్వాలు ఇచ్చిన ఇంప్లిమెంట్స్ సబ్సిడీ గురించి ఎందుకు మాట్లాడట్లేదని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. మండలం లో సుమారు నాలుగు కోట్ల రూపాయల రైతుల ప్రీమియం బడా కార్పొరేట్ శక్తుల ఖాతాల్లోకి వెళ్లాయని, త్వరలో వాటిని మరలా రైతులకు ఇప్పించేందుకు ఉద్యమం చేపడతామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, రైతులు పూచ్చాకాయాల తిరుపయ్య,కురిచేటి మురళి, చింతల చెరువు రామారావు, పూచ్చకాయల బ్రహ్మం, షేక్ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాన్ని గుర్తించడమే లక్ష్యం

**వికారాబాద్ మండల ఎంపిడిఓ సత్తయ్య**



వికారాబాద్ బ్యూరో జూలై 01 ప్రజా పాలన : గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాన్ని గుర్తించి మెరుగులు దిద్దడమే లక్ష్యంగా తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయనున్నామని వికారాబాద్ మండల ఎంపీడీవో సత్తయ్య అన్నారు. శుక్రవారం వికారాబాద్ మండల పరిధిలోని గోదంగూడ జైదుపల్లి గ్రామాలలో గ్రామ సర్పంచులు అనితా సత్తయ్య గౌడ్ బుడిగే ఎల్లమ్మ లక్ష్మణ్ ల ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాల స్థలాలను గుర్తించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామీణ యువతను శారీరకంగా మానసికంగా దృఢంగా తయారు చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కండ కలిగిన యువత దేశానికి రక్షణ కవచంగా ఉంటారని గుర్తు చేశారు. నేటి యువత శరీరానికి అవసరమగు దృఢత్వాన్ని కలిగించే ఆటలను ఆడ లేక బలహీనంగా తయారవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు సెల్ ఫోన్లు టీవీలకు ఆకర్షితులై శారీరక దృఢత్వాన్ని కోల్పోతున్నారని విచారం వ్యక్తం చేశారు చదువుతోపాటు ఆటపాటల్లో విశేషంగా రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో తగు గుర్తింపు ఉంటుందని గుర్తు చేశారు. భారతదేశ సంప్రదాయ క్రీడలైన కబట్టి ఖోఖో వాలీబాల్ వంటి ఆటలను ఆడేందుకు యువత ఆసక్తి చూపాలని ఆకాంక్షించారు.

## నిరుపేద యువకుని గురుకుల పాఠశాలలో అడ్మిషన్ ఇప్పించిన కోరుట్ల ఎమ్మెల్యే



కోరుట్ల, జూలై 01 (ప్రజాపాలన ప్రతినిధి): యామాపూర్ కు చెందిన బుద్దుల రాజేందర్ అనే నిరుపేద తండ్రి లేని యువకునికి కోరుట్ల లోని మైనారిటీ వెల్ఫేర్ పాఠశాలలో అడ్మిషన్ ఇప్పించి తమ గొప్ప మనస్తత్వాన్ని దయ హృదయాన్ని చాటుకున్న కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, అనంతరం కోరుట్ల మండలం సంగేమ్ మరియు నాగులపేట గ్రామాల లో పర్యటించి గ్రామా అభివృద్ధి కమిటీకి 3.50 లక్షల విలువ గల రెండు చెక్కలను రెండు గ్రామాలకు ప్రొసిడింగ్ పత్రాలను ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు అందజేశారు.

# శరీరానికి అవసరమగు లవణాల శాతం మిషన్ భగీరథ నీటిలో లభ్యం

## మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్



వికారాబాద్ బ్యూరో జూలై 01 ప్రజా పాలన : శరీరానికి అవసరమగు లవణాల శాతం మిషన్ భగీరథ నీటిలో లభ్యం అవుతుందని మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్ అన్నారు. శరీరానికి కావలసిన లవణాలు అంది నీరసపడకుండా అంతర్గత అవయవాలు సరిగ్గా పని చేసేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. శుక్రవారం వికారాబాద్ మండలం, గొట్టిముక్కుల గ్రామంలో మిషన్ భగీరథ త్రాగు నీటిపై కలిగే ప్రయోజనాలు, ఇతర నీటి వినియోగం వల్ల కలిగే దుష్ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఇ ఇ బాబు శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామంలో ప్రతి ఒక్కరు మిషన్ భగీరథ నీరు త్రాగాలని, ఈ నీటి వినియోగం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, అలాగే శరీరంలోని అన్ని అవయవాల పని తీరు మెరుగు పడి ఆరోగ్య సమస్యలు తగ్గుతాయన్నారు. త్రాగు నీరు కలుషితం కాకుండా గ్రామాలలో ప్రతి 10 పది రోజులకు ఒక సారి నీటి నిల్వ ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్ తో శుద్ధి చేయాలన్నారు. నీటి పైప్ లైన్ లీకేజీ కాకుండా చూసుకోవాలన్నారు. ఆర్ఓ వాటర్ డబ్బా నీరు త్రాగడం వల్ల నీటిలో లవణ శాతం తగ్గి శరీరంలోని అవయవాల పని తీరు తగ్గి అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఫ్లోరైడ్ స్థాయి తగ్గడం వల్ల మోకాళ్ళ నొప్పులు, చిన్న పిల్లలలో ఎదుగుదల, ఎముకలు మెత్తబడే అవకాశాలు ఉంటాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగునీరు అందిస్తున్నందున మిషన్ భగీరథ నీరు త్రాగి ఆరోగ్యంగా ఉండాలని కోరారు. జిల్లాలోని 19 మండలాలలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈరోజు నుండి నెల రోజుల పాటు మిషన్ భగీరథ నీరు త్రాగే విధంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు అయన తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో డి ఇ రత్నప్రసాద్, నీటి నాణ్యత పరిశీలకుడు ఉదయ్ రామ్ గ్రామ సర్పంచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొండయ్య సేవలు అభినందనీయం: మధ్యప్రదేశ్ ఎంపీ

మధిర జూలై 1 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నాడు మధ్యప్రదేశ్ ఎంపీ సంధ్యారాయ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రముఖ సామాజిక సేవకుడు లంక కొండయ్య సేవలు అవగాహన కల్పిన్తూఎయిడ్స్ బులెటన్ ఆవిష్కరణప్రతి ఒక్కరు మాస్క్ ధరించాలిమధ్య ప్రదేశ్ ఎంపీ సంధ్యరాయ ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న హెచ్ఐవి ఎయిడ్స్ మహమ్మారిపై అవగాహన నిమిత్తం తన దైన శైలిలో గత 25 సంవత్సరాలనుండి విస్తృత ముగా జన సమూహములో స్వచ్ఛందంగా అవగాహనా పరుస్తున్న ప్రముఖ సామాజిక సేవకులు మధిర ఆశ మిత్ర లంకా కొండయ్యను మధ్య ప్రదేశ్ బిన్డ్ జిల్లా ఎంపీ శ్రీ సంధ్య రాయ్ అభినందనలు తెలిపి నారు. శుక్రవారం ఉదయం మధిర పర్యటనలో భాగంగా ప్రముఖ బ్రాహ్మణ సంఘం సభ్యులు ఆర్ఎస్ఎస్ కమిటీ నిర్వహకులు శివరాజు శ్రీనివాస్ రావు గృహ%శీ%లో ఏర్పాటు చేసిన సమావేసం ఉదయం 8 గంటలకు లంకా కొండయ్య ఎంపీ సంధ్య రాయ్ గారిని మర్యాద పూర్వకముగా కలిసి కొండయ్య చేస్తున్న వివిధ సామాజిక సేవలు గురించి ప్రముఖులు తెలియపరిచగా ఆమె కొండయ్య సేవలను కొనియాడారు. అనంతరం ఆర్ఎస్ఎస్ ప్రముఖులు బ్రాహ్మణ సంఘు%శీ% పెద్దల సమక్షంలో లంకా కొండ య్య ఏర్పాటు చేసిన స్టాప్ ఎయిడ్స్ టాక్ ఎయిడ్స్ చిత్ర పటాన్ని ఎంపీ సంధ్యరాయ్ చేతులు మీదుగా ఆవిష్కరణ చేసినారు. అదే విధంగా ముందుగా ప్రస్తుతం కోవిడ్ ఫోర్త్ వేవ్ మొదలైనది కనుక ఎంపీ సంధ్య రాయ్ చేతులు మీదుగా ప్రతి ఒక్కరు మాస్క్ ధరించాలి అని కొండయ్య తెచ్చిన మాస్క్ లు కార్యకర్తల కూ పంపిణి చేసినారు. ఈ కార్యక్రమం లో ప్రముఖులు పెద్దలు %వా×జ% వనం వర ప్రసాద్ రావు గారు శివరాజు శ్రీనివాస్ రావు గారు ఆర్య వైశ్య ప్రముఖులు బీజేపీ నాయుకులు




కుంచెం కృష్ణా రావు గారు ప్రముఖ హై కేర్ హాస్పిటల్ యాజమాన్యం డా. మురళి కృష్ణా రెడ్డి గారు జిల్లా %చీఖ% మధిర డివిజన్ బాధ్యులు శివరాజు సుమంత్ జిల్లా బీజేపీ నాయుకులు విజయరాజు మధిర బీజేపీ నాయకులు సిలివేరు సాంబా శివరావు రామిశెట్టి నాగేశ్వరావు రామకృష్ణ తదితరులు తో పాటు బ్రాహ్మణ సంఘం పెద్దలు %అస్త్రఎ% శర్మ గారు వెళ్ళంకి రాజా గారు కప్ప గంతులు పట్టాభి రామశర్మ గారు ఆయుష్ %ఎతీ% సూరి శెట్టి అనంతయ్య నాయుడు సాయి కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | | | |
|---|---|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | - | చేవెళ్ల | - | 9849526878 |
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |
| టి.రాంబాబు | - | శేర్లింగంపల్లి | - | 6301925113 |
| సత్య కిషోర్ | - | అమీర్‌పేట | - | 6309723472 |
| బోడ మనోహర్ నంద | - | కరీంనగర్ | - | 9492927684 |
| రాజేందర్ ప్రసాద్ | - | ఖమ్మం | - | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | - | మధిర | - | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | - | పాలేరు | - | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | - | మయూర్ సెంటర్ | - | 9160400339 |
| మాలేడు నరేందర్ | - | ఖమ్మం రూరల్ | - | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | - | ఖమ్మం టౌన్ | - | 9948327333 |
| పసుపులేటి ఈశ్వర్‌తేజ | - | మధిర రూరల్ | - | 6305269141 |
| ఆర్.శ్రీనివాస్ | - | ఎర్రుపాలెం మండలం | - | 8501020885 |
| బుక్య.శ్రీను | - | బోనకల్ | - | 8688810293 |
| సి.మల్లేష్ | - | ఇబ్రహీపట్నం | - | 9618028334 |
| సాయికృష్ణ | - | వైరా | - | 9951486635 |
| దుంపాల రాజేష్ | - | మేడ్చల్ | - | 9000178307 |
| వై.నర్సింహులు | - | తాండూరు | - | 7207677049 |
| డి.ప్రవీణ్ కుమార్ | - | కొడంగల్ | - | 9866027635 |
| టి.సురేష్ చారీ | - | ఆసిఫాబాద్ | - | 9000983108 |
| డి.భాస్కర్ | - | బెల్లంపల్లి | - | 9440018863 |
| ఐ.నర్సింహయ్య | - | జన్నారం రూరల్ | - | 9493314399 |
| గొట్టె సురేందర్ | - | మంచిర్యాల టౌన్ | - | 9248528680 |
| గొడ్లబాబూరావు | - | తల్లాడ | - | 9848236015 |


# జనసేన పార్టీ నియోజవర్గ నాయకులు తాళ్లూరీ డేవిడ్ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ కు పాలభిషేకం



మధిర జులై 1 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నాడు నియోజవర్గం పరిధిలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అభిమానులు భారీగా తరలివచ్చికౌలు రైతులను ఆదుకున్న జనసేన పవన్ పవన్ కళ్యాణ్మధిర ఆర్వి కాంప్లెక్స్ సర్కిల్ నందు నియోజవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కౌలు రైతుల ఆదుకున్న జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గారి చిత్రపటానికి పాలభిషేకం చేసిన జనసేన పార్టీ మధిర నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు అభిమానుల ఆధ్వర్యంలో పాలభిషేకం చేయడం జరిగింది, ఈ సందర్భంగా మధిర నియోజవర్గ నాయకులు తాళ్లూరు డేవిడ్ మీడియాతో మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా ఏ రాజకీయ నాయకుడు చెయ్యని విధంగా తన కష్టాజీతంతో ఆదుకున్న మహానుభావుడు పవన్ కళ్యాణ్ గారు,అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి కవులు రైతులని తక్షణమే ఆదుకోవాలని జనసేన పార్టీ డిమాండ్,ప్రజల సమస్యల పైన పోరాడుతూ ప్రజల పక్షాన ఉంటూ ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని ఈ సందర్భంగా తెలియజేశారు, రాబోయే రోజుల్లో మధిర నియోజకవర్గంలో జనసేన పార్టీ జెండాని మధిర నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాలలో జనసేన పార్టీ జెండాని ఎగర వేస్తామనీ నియోజవర్గంలో పార్టీని బలోపేతానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మధిర జనసేన పార్టీ నాయకులు శివరామకృష్ణ, శ్యామ్, పగడాల పవన్, రిషి, బోనకల్ మండల నాయకులు, ఎస్.కె జానీపాషా, అద్దంకి సంతోష్ కుమార్, అరవపల్లి నరేష్, షేక్ బాజీ, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, జనసేన పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పట్లూర్ క్లస్టర్ రైతు వేదికలో కంది పత్తి పంటల అవగాహన సదస్సు


## మర్పల్లి మండల వ్యవసాయ అధికారిణి వసంత



వికారాబాద్ బ్యూరో జూలై 01 ప్రజా పాలన : కంది పత్తి పంటల సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు తగు మెలకువలను రైతులకు వివరించామని మర్పల్లి మండల వ్యవసాయ అధికారిణి వసంత అన్నారు. శుక్రవారం మర్పల్లి మండల పరిధిలోని పట్లూరు గ్రామ క్లస్టర్ రైతు వేదికలో గ్రామ సర్పంచ్ దేవరదేశి ఇందిర అశోక్ ఆధ్వర్యంలో పట్లూరు, ఘనపూర్, జంషెడ్పూర్, మొగిలి గుండ్ల, కొమ్సెట్పల్లి రైతులకు కంది పత్తి పంటల గురించి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మర్పల్లి మండల వ్యవసాయ అధికారిణి వసంత మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతే రాజు లక్ష్యాన్ని చేరుటకు రైతు వేదికలను నిర్మించాడని తెలిపారు. భూసారాన్ని అనుసరించి కాలానుగుణ పంటలు వేసి అధిక దిగుబడులు సాధించేందుకు రైతు వేదికలు ఎంతో ఉపయోగపడతాయని గుర్తు చేశారు. పంట మార్పిడితో భూసారము పెరిగి అధిక దిగుబడులు వస్తాయని స్పష్టం చేశారు. అందులో భాగంగా కంది పత్తి పంటల దిగుబడుల గురించి వివరించామని చెప్పారు. నాణ్యమైన విత్తనాలను ఎన్నుకొని విత్తుకుంటే అధిక దిగుబడితో పాటు ఆర్థిక ఆదాయం పెరుగుతుందని వెల్లడించారు. ప్రభుత్వం చే గుర్తింపబడిన విత్తనాలనే విత్తుకోవాలని సూచించారు. వ్యవసాయం అభివృద్ధి చెందేందుకు జలాశయాలను నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందని గుర్తు చేశారు. రైతు బాగు కోరి రైతు బంధు రైతు బీమా వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. మిషన్ కాకతీయ పథకంతో భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు. పంట నష్టపరిహారానికి వేసిన ప్రతి పంటను వ్యవసాయాధికారులకు తెలపాలని సూచించారు. పంటలను ఆశించే చీడపీడలను సకాలములో గుర్తించి వ్యవసాయాధికారుల సలహాలతో పురుగు పందులను పిచికారి చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నాయబ్ గౌడ్, గ్రామ అధ్యక్షులు శేఖర్ స్వామి, పార్టీ అధ్యక్షులు జి. అశోక్, ఎఈఓ ప్రశాంత్, వార్డ్ మెంబర్ సునీల్, పట్లూరు క్లస్టర్ కు సంబందించిన గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# బీసీ వసతి గృహాల విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 87.27

## జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఉపేందర్



వికారాబాద్ బ్యూరో జూలై 01 ప్రజా పాలన :బీసీ వసతి గృహాల విద్యార్థులు 87.27 శాతం ఉత్తీర్ణత సాధించారని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఉపేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 21 వెనుకబడిన తరగతుల వసతి గృహాలు ఉన్నాయని పేర్కొన్నారు. 2021-22 విద్యా సంవత్సరమునకు గాను 305 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షకు హాజరయ్యారని వివరించారు. 266 మంది విద్యార్థులు ఉతీర్ణు లైనారని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఉపేందర్ తెలిపారు. బిసి వసతి గృహముల నుండి మొత్తం 87.27% ఉతీర్ణత శాతం సాధించారని, ఇందులో 8 వసతి గృహముల నుండి 100 శాంతం ఉతీర్ణత సాధించారని అయన తెలియజేసినారు.

# ఇంటర్, 10వ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినిలకు సన్మానం: జడ్పిటిసి సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



మల్లాపూర్, జూలై 01 ( ప్రజాపాలన ప్రతినిధి): మల్లాపూర్ మండల కేంద్రంలో మల్లాపూర్ మాడల్ స్కూల్ పాఠశాల ఇంటర్, పదోవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను జడ్పిటిసి సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. మంగళవారం ప్రకటించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో సామల్ల వైష్ణవి, మాట్ల పావని, దండిక మనీషా, దొంతి జాహ్నవి, ఆటకారి మంజుషా,ొగరి మధులత, ఎడ్ల స్వాతి, ముక్కెర రాజమణి, ముత్యాల మనీషా, తాలూకా మనీష్, ఎదులాపురం నవ్య శ్రీ 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శనిగారపు లహరి, ఎర్ర ప్రజ్ఞ, బట్టె సృజన, మిల్కా నవీన, ఎగ్యరపు వెంకట సిద్దార్థ విద్యార్థులను శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రజాప్రతినిధులతో కలిసి జడ్పిటిసి విద్యార్థులకు శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లాడుతూ ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పరీక్షల్లో మంచి ప్రతిభను కనబర్చడం సంతోషంగా ఉందని, విద్యార్థులు కృషితో, పట్టుదలతో ఉన్నతమైన విజయాలను సాధిస్తూకన్న తల్లిదండ్రులకు, పుట్టి పెరిగిన గ్రామాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఆకుతోట రాజేష్, రైతు వేదిక అధ్యక్షులు కొమ్ముల జీవన్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ శరత్ గౌడ్, పెద్దిరెడ్డి లక్ష్మణ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పుండ్రా శ్రీనివాస్ రెడ్డి, సిరిపురం రవేందర్, బండి లింగస్వామి గౌడ్, క్యాతం జీవన్ రెడ్డి, క్యాతం సురేష్, మాట్ల శ్రీవానిస్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవం...

## ఎమ్మెల్యే డా.సంజయ్, జిల్లా లైబ్రరీఛైర్మెన్ డా.చంద్ర శేఖర్ గౌడ్



జగిత్యాల, జూలై, 01 ( ప్రజాపాలన ప్రతినిధి): పట్టణంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డాక్టర్ బిసి రాయ్ జయంతి, జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిసి రాయ్ చిత్ర పటానికి ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జిల్లా లైబ్రరీ ఛైర్మెన్ డా.చంద్ర శేఖర్ గౌడ్ నివాళులు అర్పించినారు. అనంతరం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులు ఎమ్మెల్యే, జిల్లా లైబ్రరీ ఛైర్మెన్ ను శాలువా కప్పి సన్మానించినారు. ఈ కార్యక్రమంలో సుపెరిందెంట్ రాములు, మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డేవిడ్ ఆనంద్, టివివిపి సూపరిందెంట్ సుధక్షిన దేవి, ఓఎస్ డి డా. శశి కాంత్ రెడ్డి, ఆర్ఎంఓ టివివిపి డా. రామ కృష్ణ, ఆర్ఎంఓ చంద్ర శేకర్,వైద్యులు,తదితరులు, పాల్గొన్నారు.


# డా.కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా



కోరుట్ల, జూలై 01 ( ప్రజాపాలన ప్రతినిధి ): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని కట్కం సంగయ్య ఫంక్షన్ హాల్లో కోరుట్ల ఎమ్మెల్యే కలకుంట్ల విద్యాసాగర్ రావు నేతృత్వంలో యువ నాయకులు మరియు సమాజిక సేవ తత్పర్యులు డా. కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో జులై 1 వ తేది 2022 శుక్రవారం రోజున స్కిల్ టెక్నాలజీ ద్వారా జాబ్ మేళా ను ఘనంగా నిర్వహించారు. జాబ్ మేళాకు పెద్దఎత్తున హాజరైన యువతను ఉద్దేశించి యువ నాయకులు డా.కల్వకుంట్ల సంజయ్ దిశనిర్ధేశం చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల, మెట్ పల్లి, మల్లాపూర్ మరియు వివిధ మండలాల ఎంపిపిలు, జెడ్పిటిసిలు, వివిధ హెూదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..

## శ్యామలతో పెళ్లి



**బిఎస్. రాములు**
సామాజిక వేత్త
బిసి కమీషన్ మాజీ ఛైర్మన్

ఒకసారి ఆంధ్రభూమి పేపరు అందలేదని పత్రికా ఆఫీసుకు లేఖ రాశాను. వారు ఆర్టీసీకి రాసి, దాని విలువ ఆర్టీసివద్ద వసూలు చేసి నాకు బిల్లులో జమ చేసుకున్నారు.

ఆ కాలంలో పోచంపాడు ప్రాజెక్టు పనులకోసం వచ్చిన ఇంజనీర్లు, సూపర్‌వైజర్లు క్యాంపుతోపాటు ధర్మపురిలో వ్యాపారం, ధనప్రవాహం పెరిగింది. అలా పత్రికలు తెలుగుతోపాటు ఇంగ్లీషు పత్రికలు కూడా తెప్పించాను. పత్రికల రేటుపై 25 శాతం కమీషన్ ఇచ్చేవారు. ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, డెక్కన్ క్రానికల్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కలిసి మొత్తం 150కి పైగా పేపర్లు వచ్చేవి. నెలకు నాలుగు రూపాయలు చందా. 150 పత్రికలకు 150 రూపాయల దాకా కమీషన్ వచ్చేది. అది టీచర్ జీతానికన్నా తక్కువేమి కాదు. దానికి తోడు ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి వీక్లీలు, స్వాతి మాసపత్రిక, దేవీప్రియ సంపాదకత్వంలోని ప్రజాతంత్ర వీక్లీ, చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు వంటి మాసపత్రికలు కూడా తెప్పించేవాడిని. లెక్కకు కమీషన్ ప్రభుత్వ ఉద్యోగి జీతంకన్నా ఎక్కువే ఉంటుంది. కానీ, వినియోగదారులు నెలనెలా సరిగా ఇచ్చేవారు కాదు. కొందరు ఎగబెట్టేవారు. వచ్చిన డబ్బు బర్కత్ ఉండేది కాదు. ఎప్పటికప్పుడు జమ అయిన డబ్బులను పత్రికలకు మనియార్డరు చేయడానికే ఇబ్బంది అవుతుండేది. ఒక్కొక్కరు మూడు నెలలు, నాలుగు నెలలు, ఆరు నెలలదాకా పత్రికా బిల్లు ఇచ్చేవారు కాదు. వారినుండి వడ్లు, పప్పు దినుసులు మొదలైనవి తెచ్చుకునేవాడిని. గ్రామీణ ప్రాంతాల్లో చుట్టుపక్కల పల్లెల్లో నగదు కాస్త కష్టంగానే ఉండేది. దీనికితోడు ధర్మపురిలో చిట్‌ఫండ్ నడిపిస్తున్న అతనికి చిట్టీ కడితే పెళ్ళికి కూడా ఆ డబ్బులు ఇవ్వకుండా ఎగబెట్టాడు. వ్యాపారాలల్లో ఎన్నోరకాల నష్టాలుంటాయి. బీడీల కంపెనీలో జీతం వచ్చినప్పుడు యాభై రూపాయలు నగదు కూడా పత్రికలకు, మనియార్డర్లు చేస్తుండేవాడిని. మొత్తానికి వ్యాపారమంటే అటుది ఇటు, ఇటుది అటు సగబెట్టి వ్యాపారాన్ని నడపడం అని హొటల్ నడపడం ద్వారా, పేపర్ ఏజెన్సీ నడపడం ద్వారా అర్థమైంది. బ్రాందీ షాపులో కూడా తెలిసినవారికి ఉద్దెర ఇవ్వక తప్పలేదు. బాకీలు వసూలు కాకపోవడంతో నా జేబునుంచి కట్టక తప్పలేదు. పెళ్లి అయిన తర్వాత శ్యామల నేను ధర్మపురిలో కాపురం పెట్టాము. తొలుత సంగనభట్ల నర్సయ్య బంధువైన విఠోభా ఇంట్లో కిరాయికి ఉన్నాము. కొద్ది రోజులు గడిచిందో లేదో పెళ్లి మోజు తీరకముందే ఆషాఢమాసం వచ్చింది. ఆషాఢంలో పెళ్లి అయిన మొదటి సంవత్సరం పిల్లా పిల్లవాడు కలవగూడదని సంప్రదాయం. శ్యామలను పైడిమడుగుకు తీసుకుని వెళ్లారు. ఆషాఢ విరహం అంటే ఎలా ఉంటుందో అనుభవంలోకి వస్తేగాని తెలియలేదు. అయినా ఒకట్రెండుసార్లు పైడిమడుగుకు వెళ్ళక తప్పలేదు. మా అత్త నాకు కనపడకుండానే ఉండేది. ఆ కాలంలో పల్లెల్లో మేకలు, గొర్రెలు వారానికి ఒకసారి మాత్రమే కోసేవారు. నేను వచ్చినప్పుడు చేపలు తెప్పించి వండేది. మా అత్త చేపల కూర చాలా అద్భుతంగా వండుతుంది. ఎంతో కాలానికి గాని శ్యామలకు అంత రుచిగా వండడం అబ్బలేదు. ఆషాఢం మాసం తర్వాత అమ్మ పైడిమడుగు వెళ్లి తోడుకొని ధర్మపురికి వచ్చింది. ఆ తర్వాత చిన్నత్త ఇంటికి దగ్గరగా అవుసుల విశ్వనాథం మల్లమ్మ దంపతుల బంగ్లాపై కిరాయికి చేరాము. కొంతకాలం చిన్నత్త ఇంటి పక్కనే గుడిసె వేసి అందులో ఉన్నాము. అమ్మను రమ్మని బతిమాలడంతో ఒకటి రెండుసార్లు ధర్మపురికి వచ్చింది. అప్పటికి శ్యామలకు వంట చేయడం సరిగా రాదు. ఆమె బీడీలు చేస్తుంటే, చెల్లెండ్లు, తల్లీ అన్నీ అందించేవారు. అమ్మ శ్యామలకు కొంత వంట నేర్పింది. కొంత నేను వంట నేర్పాను. వాళ్ళ పెద్ద వదినె అమ్మాయక్క (భూలక్ష్మి) దగ్గర కూడా వంట నేర్చుకుంది. అలా మొత్తంగా వంట చేయడం వంటబట్టింది. చిన్న మామ మిట్టపెల్లి రాజమల్లయ్య బీడీ కంపెనీలో చాలామంది కంపెనీకి వచ్చి బీడీలు చేసేవారు. కొంతమంది ఇంటివద్ద బీడీలు చేసి తెచ్చేవారు. అందులో ముస్లింలు కూడా ఉండేవారు. బీడీలు చెకింగ్ చేసే నన్ను గొప్ప అధికారిలాగా భావించేవారు. అందరూ అన్నా, అన్నా అని పిలవడం బీడీ కంపెనీలో సాంప్రదాయం. వారిని అక్కా అని, చెల్లి అని పిలవడం మా సంప్రదాయం. పెళ్లి అయ్యాక శ్యామల కూడా వారితోపాటు బీడీలు చేస్తుండేది. కొడుకును ఎప్పుడు కంటావు వదినె అంటూ బీడీ కార్మికులు ఆమెతో పరిహాసాలు ఆడేవారు. నాతో అన్నా మాకు అల్లుడ్ని ఎప్పుడిస్తావు అని పరిహాసాలు ఆడేవారు. అన్నట్టుగానే పెళ్లయిన కొద్ది నెలలకే శ్యామల నెల తప్పింది. అమ్మ ఏడు నెలల దాకా అప్పుడప్పుడు తీసుకుపోవడం, కార్యక్రమాలు చేయడం చేసింది. ఏడో నెలలో శ్యామలను తల్లిగారింటికి తీసుకుని వెళ్ళారు. తొమ్మిది నెలలు నిండిన తర్వాత పైడిమడుగులో ఇంటివద్దే ప్రసవించింది. సంప్రదాయిక మంత్రసాని, బంధువుల మధ్య ప్రసవం జరిగింది.

(మిగతాభాగం రేపటి సంచికలో..)

# జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు: డాక్టర్ ప్రియాంక తాల్క



హైదరాబాద్ 01 జూలై ప్రజాపాలన: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్ ప్రియాంక తాల్క వైద్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. జనగాం జిల్లా పాలకుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ ప్రియాంక తాల్క జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రజాపాలన తో మాట్లాడుతూ...డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ గౌరవార్థం 01 జూలై 1991న తొలిసారిగా జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆరోగ్య రంగంలో ఆయన చేసిన సేవలకు ఘనంగా నివాళులు అర్పించేందుకు జూలై 01 అతని వర్ధంతి మరియు పుట్టిన రోజు కలిసి వస్తుందన్నారు. డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ (01 జూలై 1882 – 01 జూలై 1962) ప్రఖ్యాత వైద్యుడు, విద్యావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక కార్యకర్త మరియు రాజకీయ నాయకుడు. డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ పశ్చిమ బెంగాల్ కు 1948 – 1962 వరకు అంటే దాదాపు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా కూడా పనిచేశాడు. డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ ను 04 ఫిబ్రవరి 1961న అత్యున్నత భారతీయ పౌర పురస్కారం, భారతరత్న తో సత్కరించారు. డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ సామాన్య ప్రజల కోసం తన జీవితాన్ని ధార పోశాడన్నారు. అనేక మందికి చికిత్స చేశాడు మరియు మిలియన్ల కొద్ది ప్రజలకు స్ఫూర్తి ప్రదాత. ఇతను మహాత్మా గాంధీ వ్యక్తిగత వైద్యుడు అని కూడా చెప్పవచ్చు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ఆయుష్షును మెరుగు పరచుకోవడానికి అంకితభావంతో పని చేసే వారిని మనం డాక్టర్లు అని పిలుస్తాము. మనం పూర్వికులు "వైద్యో నారాయణో హరి" అని సంబోంధించారు. అంటే అంతటి స్థానాన్ని వైద్య వృత్తికి ఉంది. అంతటి గౌరవాన్ని నిలుపు కోవలసిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. మానవ ఆరోగ్యం పట్ల వారి సహాయ సహకారం అంచనాలకు మించిన దన్నారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం జూలై 01న జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. మహమ్మారి పరిస్థితి ఉన్నప్పుడు, సామాన్య ప్రజల కోసం వైద్యులు ఎల్లప్పుడూ దానితో పోరాడటానికి ముందు వస్తారు. ప్రపంచాన్ని గడ గడ లాడించిన మహమ్మారి కోవిడ్–19 లో వైద్యుల సేవలను వారి కష్టాలను అందరు చూసిందే అనుభవించిందే. గతంలో ప్లేగు, ఫ్లూ, ఎయిడ్స్, ఎబోలా మొదలైన అనేక మహమ్మారి పరిస్థితులను ఎదుర్కొని వైద్యులు ప్రజలకు సేవలు అందించారు. ఇక్కడ వైద్యులు ప్రజల భద్రత మరియు వారి ఆరోగ్యం కోసం సైనికుల వలె ముందు వరుసలో ఎల్లప్పుడూ ఉంటారు. 1976 లో బి.సి. వైద్యం, సైన్స్, ప్రజా వ్యవహారాలు, తత్వశాస్త్రం, కళలు మరియు సాహిత్యం వంటి రంగాలలో పనిచేస్తున్న ప్రముఖ వ్యక్తిని గుర్తించడానికి రాయ్ జాతీయ అవార్డు అతని జ్ఞాపకార్థం స్థాపించబడినదని గుర్తు చేశారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్ ప్రియాంక తాల్క అందరికీ మరి ఒక సారి శుభాకాంక్షలు తెలియజేశారు.

## వాసవీక్లబ్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ చార్టర్ ఎకౌంటెంట్, డాక్టర్ల దినోత్సవం వేడుకలు




మంచిర్యాల బ్యూరో, జులై01, ప్రజాపాలన: అంతర్జాతీయ వైద్యుల, చార్టర్ ఎకౌంటెంట్ దినోత్సవం సందర్భంగా మంచిర్యాల వాసవీక్లబ్స్ ఆధ్వర్యంలో ప్రజలకు వివిధ రకాల సేవలు అందిస్తున్న చార్టర్ ఎకౌంటెంట్ , పలువురు వైద్యులను శుక్రవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వాసవీక్లబ్స్ నాయకులు మాట్లాడుతూ, కనిపించని దేవుడు ఊపిరి పోస్తాడు కనిపించే వైద్యులు మనకు పునర్జన్మను ప్రసాదిస్తారని, కరోనా సమయంలో డాక్టర్స్ చేసిన సేవలను కొనియాడినారు. చార్టెడ్ అకౌంట్ డే సందర్భంగా ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ గడ్డం సూర్యప్రకాష్ తో పాటు వైద్యులు డాక్టర్ గోలి శృతి, డాక్టర్ జైన సరిత , డాక్టర్ దివ్య అరుణ్, డాక్టర్ జైన రామకృష్ణ , డాక్టర్ గోలి పూర్ణచందర్, డాక్టర్ చందూరి సంతోష్, డాక్టర్ చీకోటి శ్రీకాంత్ , డాక్టర్ గణపురం మోహన్ లను ఘనంగా సత్కరించారు . ఈ కార్యక్రమాలలో వాసవి క్లబ్ అధ్యక్షుడు కేశెట్టి వంశీకృష్ణ , కార్యదర్శి నలమాసు ప్రవీణ్ ,వనిత క్లబ్ అధ్యక్షురాలు గౌరిశెట్టి ధనలక్ష్మి, కపుల్స్ క్లబ్ అధ్యక్షులు గడ్డం రమాదేవి రమేష్ , కోశాధికారి బజ్జూరి శ్రీనివాస్, వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ వుత్తూరి రమేష్ , జోన్ చైర్మన్ కాచం సతీష్ , కుంకుముట్టి వెంకటేశ్వర్లు, రీజియన్ కార్యదర్శి నాగిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ వృత్తి పవిత్రమైనది..: లయన్స్ క్లబ్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి



తల్లాడ, జులై 1 (ప్రజా పాలన న్యూస్): జాతీయ డాక్టర్స్ డే వేడుకలను శుక్రవారం తల్లాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లాడ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులు దగ్గుల రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూతన క్లబ్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తాను లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా తొలిసారిగా డాక్టర్స్ డే వేడుకలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సమాజంలో డాక్టర్ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. కరోనా కష్టకాలంలో కూడా డాక్టర్లు తమ ప్రాణాల సైతం తెగించి వైద్య సేవలు అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ కర్నాటి లక్ష్మారెడ్డి, లయన్స్ ప్రతినిధులు దసరా శ్రీనివాసరావు, లైన్స్ క్లబ్ ప్రస్తుత అధ్యక్షులు పులబాల వెంకటేశ్వర్లు, గుంటుపల్లి వెంకటయ్య, గుంటుపల్లి వెంకటేశ్వరరావు, కేతేపల్లి భాస్కరరావు, అనుమోలు సర్వేశ్వరరావు, నంబూరి కనకదుర్గ ప్రసాద్, ఆసుపత్రి సూపర్వైజర్ పెద్ద పుల్లయ్య, సిహెచ్ఓ భాస్కర్, పలువురు డాక్టర్లు ఉన్నారు.

## హమాలి కార్మికులకు లైసెన్స్ మార్కెట్ యార్డ్ సెలెక్ట్ గ్రేట్ సెక్రెటరీ నరసింహారెడ్డి అందించారు



ఇబ్రహీంపట్నం జులై 1 ప్రజా పాలన ప్రతినిధి :ఫ్రూట్ మార్కెట్ హమాలీలకు లైసెన్స్ ఇస్తున్న , ఫ్రూట్ మార్కెట్ కొత్తగూడ, బాటసింగారం, గడ్డి అన్నారం,సెలెక్ట్ గ్రేట్ సెక్రెటరీ, మరియు సిఐటి నాయకులు,ఈరోజు ఫ్రూట్ మార్కెట్ హమాలీలకు, హమాలీ లైసెన్సు లు, సిఐటి యు ఆధ్వర్యంలో ఫ్రూట్ మార్కెట్ యార్డు సెలెక్ట్ గ్రేడ్ సెక్రెటరీ నరసింహ రెడ్డి ద్వారా ఇప్పియడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ . ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మార్కెట్ యార్డు ఏర్పడినప్పటి నుంచి అమాలీలుగా పనిచేస్తున్న అమాలి కార్మికులకు ఎటువంటి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు లేవు. కావున జీవిత బీమా సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పిస్తూ ప్రతి సంవత్సరం రెండు డ్రెస్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటి యు జిల్లా నాయకులు, అమాలి కార్మిక సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు, సిఐటి యు రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ, హమాలీలు, హమాలి సంఘం అధ్యక్షులు ఎస్ డి, మసూద్, ఎస్ దేవేందర్, పోచయ్య, బి పండరి ఈ హమాలీలకి అందరికీ లైసెన్సులు ఇవ్వడం జరిగింది.

## కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఎస్ సి వర్గీకరణ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెట్టాలి : మాదిగ లాయర్స్ ఫెడరేషన్



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ):రానున్న పార్లమెంట్ సమావేశాలలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఎస్ సి వర్గీకరణ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు మాదిగ లాయర్స్ ఫెడరేషన్. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు వై కె విశ్వనాధ్ మాట్లాడుతూ జాతీయ కార్యవర్గ సమావేశాలకు హైదరాబాద్ కు విచ్చేస్తున్న బిజెపి నాయకులు ఇకనైనా ఎస్ సి వర్గీకరణ బిల్లు ను పార్లమెంట్ లో ప్రవేశ పెట్టాలని, మాదిగ లు అత్యంత దీన పరిస్థితి లో ఉన్నారని, గత ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని బిజెపి ప్రభుత్వం మాదిగ ల సంక్షేమం కోరితే తక్షణమే బిల్లు ప్రవేశ పెట్టి చట్టం చేసి ఎస్ సి లకు న్యాయం చేయాలన్నారు.అధికారం లోకి వస్తే వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామన్నా కేంద్ర ప్రభుత్వం మాట నిలుపుకోవాలన్నారు.ఈ కార్యక్రమం లో ఫెడరేషన్ నాయకులు ముత్తయ్య, వివి రత్నంకొత్తపల్లి ప్రసాద్ తో పాటు మరికొందరు న్యాయవాదులు పాల్గొన్నారు.

## మాటూరుపేట పీహెచ్సీలో ఘనంగా డాక్టర్స్ డే కనిపించే దేవుళ్ళు డాక్టర్లు.గడ్డం సుబ్బారావు



మధిర జులై 01 : మండలం పరిధిలో శుక్రవారం నాడు మాటూరుపేట గ్రామంలో గడ్డ సుబ్బారావు ఆధ్వర్యంలో నేడు డాక్టర్స్ డే సందర్భంగా మాటూరుపేట సీతారామాంజనేయ కళా పరిషత్ అధ్యక్షులు గడ్డం సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలోని డాక్టర్ వెంకటేష్, ఆయుర్వేదిక్ డాక్టర్ శ్రీనివాస్కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కరోనా మహమ్మారి లాంటి సమయంలో ప్రజలకు తమ సేవలను అందించిన ఘనత డాక్టర్లదేనని ఈ సందర్భంగా అన్నారు. కనపడే దేవుళ్ళు డాక్టర్లని, వారి సేవలను మాటల్లో చెప్పలేమని, తల్లి జన్మనిస్తే జీవితానికి పునర్జన్మ కల్పించడం వారు వల్లే సాధ్యమేనని, డాక్టర్లకు ప్రతి ఒక్కరు రుణపడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు తాటికొండ వెంకటేశ్వరరావు, చిలువేరు బుచ్చిరామయ్య, చిలువేరు శాంతయ్య, ఆసుపత్రి సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## 4న హైదరాబాదులో జరిగే ధర్నాను జయప్రదం చేయండి:ఐద్వా మధిర పట్టణ కార్యదర్శి మండవ ఫణీంద్ర కుమారి



మధిర జూలై 1 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నాడు చలో హైదరాబాద్ ఈనెల 4వ తారీఖు జరిగే ధర్నాకుఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో వెలుగులోకి వచ్చిన సమస్యల పరిష్కారానికి జులై 4వ తేదీన హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నాలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఐద్వా మధిర పట్టణ కార్యదర్శి మండవ ఫణీంద్ర కుమారి కోరారు. గురువారం ఐద్వా మధిర పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మధిర మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించి వార్డు నందు సమస్యలపైన ఇంటింటి సర్వే నిర్వహించి, సంతకాలు సేకరణ చేశారు, "ఈ సేకరించిన పత్రాలను ఐద్వా ద్వారా రాష్ట్రపతికి పంపిస్తామని" ఆమె తెలిపినారు.. ఈ సందర్భంగా ఐద్వా మధిర పట్టణ కార్యదర్శి మండవ ఫణింద్ర కుమారి మాట్లాడుతూ అర్హులందరికీ డబల్ బెడ్రూమ్ ఇళ్ళు, రేషన్ కార్డులు,ఒంటరి మహిళల, వృద్ధాప్యం, వితంతువు, ఫించన్లు ఇవ్వాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల సరుకులను ఇవ్వాలని, అభయ హస్తం నిధులను వెంటనే విడుదల చేయాలని, రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి తదితర సమస్యల పరిష్కారానికి ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోరాటాలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఐద్వా కమిటీ సభ్యులు మధిర ఐద్వా అధ్యక్షురాలు %ంఎ%.ఫాతిమాబేగం,వెంకట్రావమ్మ,పద్మ తదితరులు పాల్గొన్నారు.

## రోటేరియన్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన గడ్డం జ్ఞాన ప్రకాశ్ రెడ్డి



యాదాద్రి భువనగిరి జిల్లా 01 జూలై ప్రజాపాలన: నూతనంగా ఎన్నికైన పలు రోటరీ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శి మరియు కార్యవర్గ సభ్యులకు అసిస్టెంట్ గవర్నర్ 3150 గడ్డం జ్ఞాన ప్రకాశ్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. రోటరీ క్లబ్ భువనగిరి ఫోర్ట్ నూతన అధ్యక్షులు మందడి వెంకట్ రెడ్డి, కార్యదర్శి వారాల రామకృష్ణారెడ్డి , కోశాధికారి సబ్నకర్ వెంకటేష్ మరియు కార్యవర్గ సభ్యులకు, ప్రాథమిక సభ్యులకు మరియు 2021–22 కార్యదర్శి శ్రీ జిట్ట భాస్కర్ రెడ్డికి మరియు భువనగిరి రోటరీ క్లబ్ నూతన అధ్యక్షులు బండారు శ్రీనివాస్ రావు, కరిపే నర్సింగ్ రావు కార్యదర్శి, బోగ హరిక్రిష్ణ కోశాధికారి మరియు కార్యవర్గ సభ్యులకు, ప్రాథమిక సభ్యులకురోటరీ సంవత్సరం విజయవంతం కావాలని ఆశిస్తూ పలువురు రోటేరియన్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు అందజేసిన వారిలో డా. ఎంపల్ల బుచ్చిరెడ్డి, ఛైర్మన్, మెంబెర్షిప్ ఎక్స్టెన్షన్ తెలంగాణ రీజియన్,గడ్డం జ్ఞాన ప్రకాష్ రెడ్డి అసిస్టెంట్ గవర్నర్ రోటరీ 3150 జిల్లా తదితరులు ఉన్నారు.

## జక్కన్నకి నో చెప్పి కెరీర్ లోనే పెద్ద తప్పు చేసిందట



తపన అనే సినిమా తో దాదాపుగా ఇరవై సంవత్సరాల క్రితం తెలుగు సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ అర్చన.. అలియాస్ వేద. కెరీర్ ఆరంభంలో ఈ అమ్మడి పేరు విషయంలో కాస్త గందరగోళం ఉండేది. కాని ఇప్పుడు ఈమె పూర్తిగా అర్చనగా అందరికి సుపరిచితురాలు అయ్యింది. తెలుగు బిగ్ బాస్ సీజన్ 1 లో సందడి చేసిన ఈ అమ్మడు ప్రస్తుతం ఫ్యామిలీ లైఫ్ ను ఎంజాయ్ చేస్తోంది.నటిగా సుదీర్ఘ కాలం పాటు కొనసాగిన ఈమెకు స్టార్ డమ్ మాత్రం దక్కలేదు. చేసిన పాత్రలకు గుర్తింపు అయితే దక్కింది కాని.. ఎప్పుడు కూడా ఆఫర్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ పరిస్థితికి ఆమె స్వయంకృతం కూడా ఒక కారణం అన్నట్లుగా మీడియా వర్గాల్లో టాక్ ఉంది. ఆమె కూడా తాజాగా అలీతో సరదాగా టాక్ షో లో ఆ విషయం నిజమే అన్నట్లుగా వ్యాఖ్యలు చేసింది.ఎన్టీఆర్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన యమదొంగ సినిమా లో ఒక ప్రత్యేక సాంగ్ లో అర్చన కనిపించింది. ఆ సాంగ్ ద్వారా ఆమెకు పెద్దగా గుర్తింపు రాలేదు. హీరోయిన్ గా చేస్తున్న సమయంలో స్పెషల్ సాంగ్ చేసి తప్పు చేశాను అనుకుందట. ఆ సమయంలోనే మగధీర సినిమాలో ఈమెకు అవకాశం వచ్చింది. అందులో కూడా ఒక ప్రత్యేక సాంగ్ అవ్వడం వల్ల నో చెప్పిందట.మగధీర సినిమాలో ఏ పాత్రకు అనే విషయాన్ని అర్చన చెప్పలేదు కాని.. సలోని పోసించిన పాత్రకు మొదట అర్చనను అడిగి ఉంటారు అనేది టాక్. ఆ విషయం పక్కన పెడితే మగధీర సినిమాలో నటించక పోవడం వల్ల రాజమౌళి నుండి ఒక మంచి ఆఫర్ మిస్ అయ్యిందని అర్చన ఆవేదన వ్యక్తం చేసింది.ఒక వేళ మగధీర చేసి ఉంటే ఖచ్చితంగా తదుపరి సినిమా అంటే మర్యాద రామన్న లో అర్చనకు అవకాశం ఉండేది. తద్వారా ఇండస్ట్రీలో స్టార్ గా గుర్తింపు దక్కి ఉండేది అంటూ ఆమె అభిప్రాయం. నిజంగానే అర్చన మగధీర సినిమా ను కాదని పెద్ద తప్పు చేసింది. అయితే ఇండస్ట్రీలో ఇలాంటి తప్పిదాలు జరుగుతూనే ఉంటాయి.మగధీర సినిమాకు నో చెప్పడం తన కెరీర్ లోనే అతి పెద్ద తప్పు అన్నట్లుగా అర్చన కూడా తాజాగా అలీ తో సరదాగా టాక్ షో లో పాల్గొంది. భర్త తో కలిసి టాక్ షో లో పాల్గొన్న అర్చన పలు విషయాలను షో లో చెప్పుకొచ్చింది. వచ్చే వారంలో ప్రసారం కాబోతున్న షో కు సంబంధించిన ప్రోమో వచ్చింది. ఆ ప్రోమో వైరల్ అవుతోంది.

## అల్లూరిగా ఫస్ట్ లుక్ లో శ్రీవిష్ణు స్టన్నింగ్ అవతార్.!



మాన టాలీవుడ్ లో ఉన్నటువంటి ప్రెజెంట్ జెనరేషన్ యంగ్ హీరోస్ తమ టాలెంటెడ్ ఆకట్టుకునే అతి తక్కువ మందిలో నటుడు శ్రీ విష్ణు కూడా ఒకడు. తనదైన సింపుల్ నటనతో ప్రతి సినిమాలో తాను ఆకట్టుకుంటాడు. అయితే తన నుంచి పలు మాస్ రోల్స్ కూడా పడ్డాయి కానీ ఈసారి మాత్రం అంతకు మించిన మాస్ ని తాను చూపించబోతున్నాడు అనిపిస్తుంది.తాను హీరోగా నటిస్తున్న లేటెస్ట్ సినిమా "అల్లూరి" పై మంచి బజ్ ఉంది. ఇక ఈ సినిమాలో అయితే తాను పవర్ ఫుల్ పోలీస్ గా నటిస్తున్నట్టు కన్ఫర్మ్ కాగా ఇప్పుడు ఈ సినిమా నుంచి మేకర్స్ స్టన్నింగ్ ఫస్ట్ లుక్ పోస్టర్ ని రిలీజ్ చేశారు. ప్రదీప్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ శ్రీ విష్ణు మేకోవర్ స్టన్నింగ్ గా ఉందని చెప్పాలి.తన లుక్ చూస్తే ఈ సినిమా కోసం తాను బాడీ కూడా చాలా సాలిడ్ గా మార్చినట్టు అనిపిస్తుంది. ఇంకా తన మీసకట్టు, సినిమా క్యాప్షన్ అంతా చూస్తే ఈ సినిమాలో తన పాత్ర ఎంత స్ట్రాంగ్ గా ఉంటుందో అర్ధం అవుతుంది. మొత్తానికి అయితే ఈ పోస్టర్ మాత్రం మంచి అంచనాలు పెంచింది. ఇక ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తుండగా లక్కీ మీడియా వారు నిర్మాణం వహిస్తున్నారు.

## మరోసారి ప్రభాస్ అనుష్క కాంబో?



స్టార్ హీరోయిన్ అనుష్క బాహుబలి సినిమా తర్వాత స్పీడ్ పెంచుతుంది అనుకుంటే ఆ తర్వాత ఆమె మరింత నెమ్మదిగా సినిమాలో చేసుకుంటూ వెళుతుంది. నిశ్శబ్దం సినిమా తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాని అనుష్క తదుపరి ప్రాజెక్టును యూవీ క్రియేషన్స్ లోనే చేయడానికి ఒప్పుకున్న విషయం తెలిసిందే. ఆ సినిమాలో నవీన్ పోలిశెట్టి కథానాయకుడుగా నటిస్తూ ఉండగా హీరో కంటే ఎక్కువ వయసు ఉన్న మహిళగా అనుష్క కనిపించబోతోంది.డిఫరెంట్ ఏజెస్ గ్రూప్ లవ్ స్టోరీ గా రాబోతున్న ఆ సినిమా కోసం అనుష్క కాస్త బరువు కూడా తగ్గనుందట. అయితే ఇంకా ప్రాజెక్ట్ మాత్రం మొదలవ్వలేదు. ఇక ఇంతలో ఆమెకు మరిన్ని అవకాశాలు వస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే అనుష్క మాత్రం ఇప్పుడు ఎంత పారితోషికం ఇచ్చినా కూడా కమర్షియల్ పాత్రలో నటించడానికి ఏమాత్రం ఆసక్తి చూపించడం లేదు. కేవలం తనకు నచ్చిన సినిమాలు మాత్రమే చేసుకుంటూ వెళ్లాలని అనుకుంటుంది.ఇక రీసెంట్ గా అనుష్క ప్రభాస్ తో కూడా సినిమా చేసేందుకు చర్చల్లోకి వెళ్లినట్లు సమాచారం. మారుతీ దర్శకత్వంలో ప్రభాస్ ఒక సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే.హారర్ కామెడీ డ్రామా గా కాబోతున్న ఆ సినిమాకు రాజా డీలక్స్ అనే టైటిల్ కూడా అనుకున్నట్లు తెలుస్తోంది. ఇంకా ఆ ప్రాజెక్టు పై అఫీషియల్ క్లారిటీ ఇవ్వలేదు. కానీ జరగాల్సిన పనులన్నీ కూడా కొనసాగుతున్నట్లు సమాచారం.ఇప్పటికే ప్రత్యేకంగా ఒక భారీ బంగ్లా సెట్ నిర్మాణం కూడా జరిగిందని చెబుతున్నారు. ఇక అనుష్కను అందులో ఒక హీరోయిన్ గా అనుకుంటున్నారట. సినిమాల్లో మొత్తంగా ముగ్గురు హీరోయిన్స్ ఉంటారు అని తెలుస్తోంది. ఇక అనుష్క క్యారెక్టర్ గురించి వినగానే వెంటనే ఒప్పుకున్నట్లు సమాచారం. ఇదివరకే ప్రభాస్ తో మూడుసార్లు నటించిన అనుష్క ఇప్పుడు నాలుగోసారి కూడా నటించే అవకాశం ఉన్నట్లు టాక్. మరి ఇది ఎంతవరకు నిజమో తెలియాలి అంటే మరి కొన్ని రోజులు ఆగాల్సిందే.

## అలియాపై బాలీవుడ్..హాలీవుడ్ స్పెషల్ కేర్!

బాలీవుడ్ నటి అలియాభట్ గర్భం దాల్చినా షూటింగ్ విషయంలో తగ్గేదేలే అంటూ దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆమె కథానాయికగా నటిస్తోన్న సినిమాలు కొన్ని సెట్స్ లో ఉన్నాయి. వాటిని పూర్తిచేసే వరకూ అలియా విరామం లేకుండా పనిచేయడానికి సిద్ధమవుతోంది. రణ్ వీర్ సింగ్ సరసన 'రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ'లో నటిస్తోంది.ఇప్పటికే చాలా భాగం షూటింగ్ సహా పాటల చిత్రీకరణ జరిగింది. అయితే ఓ పాట బ్యాలెన్స్ ఉండిపోయింది. విదేశాల్లో షూట్ చేయాల్సిన పాట కావడంతో యూనిట్ ఆ పాటని చివర్లో షూట్ చేద్దామని వదిలేసింది. ఇప్పుడా సమయం ఆసన్నమైంది. జులై తొలి వారంలో ఆపాటని అలియా-రణవీర్ పై ఆస్ట్రియాలో షూట్ చేయడానికి యూనిట్ రెడీ అవుతోంది. అందుకోసం టీమ్ ఇప్పటికే ఆస్ట్రియాలో అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. షూట్ లో భాగంగా సెట్స్ కి అన్ని రకాల సౌకర్యాలతో కూడిన అంబులెన్స్ లు సైతం రెడీగా పెడుతున్నట్లు తెలుస్తోంది. అలియా గర్భవతి కావడంతోనే ఈ రకమైన ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఆ పాట షూటింగ్ పూర్తిగా కాగానే అలియా ఆస్ట్రియా నుంచి నేరుగా లండన్ చేరుకుంటుందని సమాచారం. హాలీవుడ్ సినిమా 'హార్ట్ ఆఫ్ స్టోన్ 'షూటింగ్ లో భాగంగానే అలియా షెడ్యూల్ అలా ప్లాన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. 'ఆర్ట్ ఆఫ్ స్టోన్' షూటింగ్ కూడా ముగింపు దశలోనే ఉంది. అలాయా భట్ గర్బవతి కాకముందే కీలక యాక్షన్ సన్నివేశాలు పూర్తిచేసారు. తదుపరి లండన్ షెడ్యూల్ లో ఇంకొన్ని యాక్షన్ సన్నివేశాలు పూర్తి చేయాల్సి ఉంది.అది పూర్తయితే అలియా పై షూట్ మొత్తం పూర్తవుతుంది. అందుకోసమే అలాయాభట్ నేరుగా లండన్ చేరుకునేలా జర్నీ ప్లాన్ చేసుకుంది. ఆస్ట్రియా నుంచి ఇండియా వచ్చి..ఇక్కడ నుంచి మళ్లీ లండన్ జర్నీ ఇబ్బందులు తగ్గుతాయనే కారణంగా ఇలా ప్లాన్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. హాలీవుడ్ సినిమా యూనిట్ కూడా అలియా కోసం ప్రత్యేకంగా ఆరోగ్య పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సెట్ లో అన్ని రకాల ఏర్పాట్లు.. జాగ్రత్తులు తీసుకునే చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ప్రస్తుతం అలియాభట్ ముంబైలోనే ఉంది. వీలైనంత సమయాన్ని కుటుంబం తోనే గడుపుతోంది. బయట తిరగడం బాగా తగ్గింది. పెళ్లికి ముందు..పెళ్లి తర్వాత చోటుచేసునే వ్యత్యాసం ఎలా ఉంటుంది? అన్నది అలియా ని చూస్తే తెలుస్తుంది.



## సలార్ - పుష్ప 2 వచ్చే వేసవికి కష్టమే



కేజీఎఫ్ 2 ప్రభావం సలార్ - పుష్ప 2 లపై బలంగా పని చేస్తోందా? 2023 వేసవికి ఆ రెండు సినిమాలు రావడం కష్టమేనా? అంటే అవుననే విశ్లేషణ సాగుతోంది. ప్రభాస్ నటిస్తున్న సాలార్ .. అల్లు అర్జున్ పుష్ప 2 విడుదలలు ఆలస్యం కానున్నాయని తాజా సన్నివేశం చెబుతోంది.దీనికి కారణం కేజీఎఫ్ 2 ఇంపాక్ట్. రాకింగ్ స్టార్ యష్ నటించిన కేజీఎఫ్ సిరీస్ మాస్ సినిమాను మరో లెవల్లో పునర్నిర్వచించింది. భారీ ఎలివేషన్ సన్నివేశాలు.. పంచ్ డైలాగ్ లు.. యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులపై ఎంతగా ప్రభావం చూపుతాయంటే మాస్ ఎలిమెంట్స్ తో కూడిన సాధారణ లేదా రొటీన్ చిత్రాలతో సినీ ప్రేక్షకులను సంతృప్తి పరచడం దర్శకనిర్మాతలకు తలకు మించిన భారంగా మారింది.మరో రకంగా చెప్పాలంటే తెలిసీ తెలియక సినిమాలను కేజీఎఫ్ సిరీస్ తో పోల్చుకుంటున్నారు. ఇది ఇప్పుడు తాజా పెద్ద బడ్జెట్ సినిమాల స్క్రిప్ట్ లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం పెద్ద సినిమాలు తీస్తున్న మేకర్స్ పై ఇది వివరీతమైన ఒత్తిడి ని పెంచుతోంది. యావరేజ్ కంటెంట్ తో ప్రేక్షకులను మెప్పించడం చాలా కష్టం కాబట్టి పెద్ద సినిమాలు తీసేవారు కూడా ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సి వస్తోంది.నిజానికి ఈ ఒత్తిడి ప్రశాంత్ నీల్ పై ఉన్నందున ప్రభాస్ తో తెరకెక్కిస్తున్న సలార్ అంతకంతకు ఆలస్యమవుతోందని సమాచారం. మూవీ విడుదల ప్రణాళికలపై తీవ్ర ప్రభావం కనిపిస్తోందని గుసగుస వినిపిస్తోంది. నిజానికి ఈ సినిమా వచ్చే వేసవిలో విడుదలవుతుందా లేదా! అనేది చెప్పలేమనే టాక్ స్ప్రెడ్ అవుతోంది. అదేవిధంగా అల్లు అర్జున్ పుష్ప 2 విడుదల వాయిదాకు వెళుతుంది. ఈ చిత్రం 2023 మిడిల్ లో విడుదలయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. స్క్రిప్టు దశలోనే కంటెంట్ పరంగా పెద్ద రేంజుకు వెళుతున్నారు. భారీ తనం నిండి సీన్ల కోసం బడ్జెట్లను పెంచుతున్నారని కూడా టాక్ వినిపిస్తోంది. అయితే పాన్ ఇండియా ప్రయత్నం అన్నివేళలా వర్కవుటవుతుందా? అంటే కొన్ని సందేహాలున్నాయి. నేటి రోజుల్లో ప్రేక్షకుల్లో అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. మహమ్మారి అనంతర కాలంలో సినీ ప్రేక్షకులు మునుపటిలా థియేటర్లకు రావడం లేదు. ప్రేక్షకుల ఎంపికలు మారాయి. సినిమా గురించి చాలా మంచి టాక్ వస్తే కానీ థియేటర్లకు రావడం లేదు.. దీని ప్రభావం పాన్ ఇండియా చిత్రాలకు తొలి రోజు టాక్ పై ఆధారపడి ఉంటుందని పరిశ్రమ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.బాలీవుడ్ లో సౌత్ స్టార్స్ ఆదరణ పొందడం ఒక మంచి పరిణామం. సరైన బడ్జెట్ మార్కెటింగ్ తో ఏ ఫిల్మ్ మేకర్ అయినా పాన్-ఇండియా సినిమాని తీయగలడు. కానీ ఒక్కోసారి కంటెంట్ ఆశించిన మార్క్ కు అనుగుణంగా లేకుంటే వ్యాపారంలో నష్టాలు రావొచ్చు అని కూడా విశ్లేషిస్తున్నారు.ఓటీటీ ప్లాట్ ఫామ్ లో సినిమాలను విడుదల చేయడం కూడా దర్శకనిర్మాతలకు సవాలుగా మారిందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఓటీటీ నిర్మాతలకు మరొక ఆదాయ వనరుగా మారినప్పటికీ కొద్దిపాటి ప్రతికూల సమీక్షలు లేదా సగటు కంటెంట్ చిత్రం త్వరగానే డిజిటల్ ప్లాట్ ఫారమ్ లోకి వస్తుందని ప్రేక్షకులు గ్రహించడం వల్ల భారీ నష్టాన్ని చవిచూడవచ్చు అని ఒక ఎగ్జిబిటర్ విశ్లేషించారు. తాజాగా సుదీప్ నటించిన పాన్-ఇండియా చిత్రం విక్రాంత్ రోనా .. రణబీర్ నటించిన శంషేరా చిత్రాలు ఎలాంటి విజయాలు సాధిస్తాయో చూడాల్సి ఉంది.

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేడ్కర్



BUSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది

అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేడ్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేడ్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేడ్కర్

జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989